
# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 సంచిక : 174 పేజీలు : 8 వెల : రూ.2/- సోమవారం 20 జులై 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


# బిల్లులు పాసయ్యేనా?



## నేటి నుంచి వర్షాకాల సమావేశాలు

### - పార్లమెంట్ ముందుకు కీలక బిల్లులు

- రసవత్తరంగా సాగనున్న సమావేశాలు
-కేంద్రాన్ని నిలదీసేలా ప్రతిపక్షాల వ్యూహం
-నీట్, అయోధ్య అంశాలపై పోరుకు సిద్ధం
దీటుగా ఎదుర్కొనేందుకు అధికారపక్షం రెడీ
అఖిలపక్ష భేటీలో రగడ.. విపక్షాల వాకౌట్

**న్యూ ఢిల్లీ, మన జనప్రగతి జులై 19 :** నేటి నుంచిపార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభంకానున్నాయి. సోమవారం నుంచి ఆగస్టు 13 వరకుజరగనున్న ఈ సమావేశాలు దేశ చరిత్రలోకీలకంగా మారనున్నాయి. ముఖ్యంగా కేంద్రండీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ లాంటి కీలకబిల్లులను తీసురాబోతున్నట్లుగా మెజారిటీరాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. గతసమావేశాల్లో ఆమోదించు కోలేకపోయిన మోదీసర్కార్ ఈ సెషన్లో వాటిని ఆమోదించుకోవాలనేగట్టి పట్టుదలతో ముందుకు వెళ్తున్నాయి. ఇప్పటికేపార్టీల్లో చీలికలు, ప్రాంతీయ పార్టీల నుంచిఎన్డీఏకు లభిస్తున్న మద్దతుతో మెజార్టీ మార్క్ఉన్నట్లుగా అంచనాతో ఉన్నారు. దీంతో ఈసమావేశాలు రసవత్తరంగాసాగనున్నాయి.

మిగతా 2లో.



# పీవీ సింధు చారిత్రక విజయం

## జపాన్ ఓపెన్ టైటిల్ వశం

### ఫైనల్లో యమగూచిపై ఘన విజయం



**టోక్యో మన జనప్రగతి జులై 19 :** భారత అగ్రశ్రేణి షట్లర్, తెలుగు తేజం పి.వి సింధు చరిత్ర సృష్టించింది. జపాన్ ఓపెన్ సూపర్ 750 టైటిల్ సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా నిలిచింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో మూడుసార్లు ప్రపంచ చాంపియన్ అకానె యమగూచి (జపాన్)పై 21-17, 21-17తో పి.వి సింధు వరుస గేముల్లో గెలుపొందింది. 50 నిమిషాల టైటిల్ పోరు థ్రిల్లర్‌లో అన్‌సీడెడ్ సింధు అద్భుత విజయం సాధించింది. 2024 సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ (సూపర్ 300) తర్వాత సింధుకు ఇదే తొలి టైటిల్ కాగా.. 2022 సింగపూర్ ఓపెన్ (సూపర్ 500) తెలుగు తేజానికి ఇదే తొలి మేజర్ టైటిల్. 31 ఏండ్ల వయసులో జపాన్ ఓపెన్ విజేతగా నిలిచిన సింధు.. ఈ ఘనత సాధించిన తొలి భారత

మిగతా 2లో.

## జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కలకలం..

### ట్రైనీ ఐపీఎస్ పై కేసు

హైదరాబాద్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో దారుణ ఘటన
మహిళా ఐపీఎస్ ట్రైనీపై లైంగిక వేధింపులకు పాల్పడిన సహోద్యోగి
ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేసిన పోలీసులు
కత్తితో బెదిరించి, అభ్యంతరకర వీడియోలు తీశాడని బాధితురాలి ఫిర్యాదు
బాధితురాలి భర్తకే ఆ వీడియోలను పంపినట్లు ఆరోపణలు




**హైదరాబాద్ మన జనప్రగతి జులై 19 :** దేశంలోనే అత్యున్నత పోలీస్ శిక్షణా కేంద్రమైన హైదరాబాద్ లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ లో ఒక దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ పై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడన్న తీవ్ర ఆరోపణలపై ఉదయ్ కృష్ణారెడ్డి అనే ట్రైనీ ఐపీఎస్‌పై కేసు నమోదైంది. ఈ ఘటన పోలీస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.


మిగతా 2లో.

# లిస్టు రెడీ..

## ఆ ఎమ్మెల్యేలు సర్దుకోవాల్సిందే..

### డిసైడ్ అయిన చంద్రబాబు

**అమరావతి మన జనప్రగతి జులై 19 :** కట్టుతప్పిన ఎమ్మెల్యేల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యంత కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించారు. రెండేళ్లుగా ఎమ్మెల్యేల పనితీరుపై దిశానిర్దేశం చేస్తున్నా కొందరు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, ఇకపై అటువంటి వారిని ఎంత మాత్రం ఉపేక్షించే పరిస్థితి లేదని సీఎం స్పష్టం చేస్తున్నారు. పార్టీ ముఖ్యనేతలతో ఈ విషయమై తన అంతరంగాన్ని సీఎం బయటపెట్టడంతో టీడీపీ వర్గాల్లో హాట్ టాపిక్ అవుతోంది. కొందరు ఎమ్మెల్యేలు ఎన్నిసార్లు చెప్పినా పనితీరు మార్చుకోవడం లేదని, దాంతో వారిని వదిలించుకోవడమే మేలు అన్న నిర్ణయానికి చంద్రబాబు వచ్చారని



మిగతా 2లో.

## జమ్మూ కశ్మీర్‌లో జల ప్రళయం..

### 12 మంది మృతి

భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు, విరిగిపడిన కొండచరియలు
పూంచ్, రాజౌరీ జిల్లాల్లో తీవ్ర ఆస్తి నష్టం
నిరసన రద్దు చేసుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న సీఎం
ఇంకా పలువురి ఆచూకీ గల్లంతు, కొనసాగుతున్న సహాయక చర్యలు



2లో.

# ప్రైవేటుకు కట్టబెట్టే కుట్ర

రామాయపట్నం పోర్టుపై టీడీపీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్న జగన్
రూ.4929 కోట్ల ప్రాజెక్టును రూ.1500 కోట్లకే అమ్ముతున్నారని విమర్శ
టీడీపీ పెద్దల జేబులు నింపడానికే ఈ స్కామ్ అంటూ ఘాటు వ్యాఖ్యలు
ఇదేం అర్థశాస్త్రం అంటూ చంద్రబాబును సూటిగా ప్రశ్నించిన జగన్

**అమరావతి మన జనప్రగతి జులై 19 :** రామాయపట్నం పోర్టు విషయంలో ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత కీలకమైన రామాయపట్నం పోర్టును టీడీపీ పెద్దల జేబులు నింపేందుకు ఓ భారీ స్కామ్‌గా మార్చారని, రాష్ట్ర ఖజానాకు వేల కోట్ల



మిగతా 2లో.



2లో.

## తమ్మినేని భూ కబ్జా

2023లో కుమారుడి పేరిట రిజిస్ట్రేషన్
సీతారాం, భార్య, కుమారుడిపై కేసు
యజమాని ఉన్నా ఫేక్ డెత్ సర్టిఫికెట్
తప్పుడు వారసత్వ పత్రాల సృష్టి
బాధితుడి ఫిర్యాదుతో 13 మందిపై కేసు
సహకరించిన సబ్ రిజిస్ట్రార్‌పైనా నమోదు

# సర్ పై దృష్టి

పది రోజులు నియోజకవర్గాల్లో పర్యటించాలి
ఈ నెల 30న పూర్తి స్థాయిలో మళ్లీ సమీక్ష నిర్వహిస్తాం
: సర్ పై జూమ్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ మన జనప్రగతి జులై 19 :** సర్ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరు పది రోజులు నియోజకవర్గాల్లో పర్యటించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. పొడిగింపును ఒక అవకాశంగా తీసుకోవాలని సూచించారు. సర్ పై ప్రతి ఒక్కరు సీరియస్ గా దృష్టి సారించాలన్నారు. హైదరాబాద్ చుట్టూ తిరుగుతూ గాంధీభవన్ కు వస్తామంటే కుదరదని తేల్చి చెప్పారు. అన్ని విషయాలపై ఈ నెల 30న పూర్తి స్థాయిలో మళ్లీ సమీక్ష నిర్వహించి, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నివేదికలు స్వీకరిస్తామని



మిగతా 2లో.

# పీవీ సింధు చారిత్రక విజయం

**మొదటిపేజీ తరువాయి**

షట్లర్‌గా రికార్డు నెలకొల్పింది. మిక్సడ్ డబుల్స్‌లో టాప్ సీడ్ చైనా జోడీ ఫెంగ్, పింగ్‌లు విజేతలుగా నిలువగా.. పురుషుల సింగిల్స్‌లో క్రిస్టో పాపొవ్ (ఫ్రాన్స్) టైటిల్ సాధించాడు. మహిళల డబుల్స్‌లో కిమ్, కాంగ్ (దక్షిణ కొరియా), పురుషుల డబుల్స్‌లో ఫజర్, ఫిక్రి (ఇండోనేషియా) చాంపియన్లుగా అవతరించారు.నువ్వా..నేనా

మహిళల సింగిల్స్ ఫైనల్ హోరాహోరీగా సాగింది. లోకల్ స్టార్ యమగూచి ఈ ఏడాది సింధుపై ఆడిన రెండు మ్యాచుల్లోనూ గెలుపొందింది. సింధు వరుసగా క్వార్టర్స్, సెమీఫైనల్లో ప్రత్యర్థుల వాకోవర్ ఇవ్వటంతో చెమటపట్టకుండా ఫైనల్‌కు చేరుకుంది. రెండు సార్లు ఒలింపిక్ పతక విజేత సింధు.. టైటిల్ పోరులో సత్తా చాటింది. తొలి గేమ్‌లో 3-0తో మందంజ వేసింది. యమగూచి పుంజుకుని 5-5తో స్కోరు సమం చేసినా సింధు 9-6తో మెరిసింది. విరామ సమయానికి 9-11తో సింధు వెనుకంజ వేసింది. కానీ విరామం తర్వాత సింధు రెచ్చిపోయింది. వరుస పాయింట్లు సాధించింది. 12-12తో స్కోరు సమం చేయటంతో పాటు 16-12, 17-15తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 38 షాట్ల సుదీర్ఘ ర్యాలీలో పైచేయి సాధించిన యమగూచి 17-17తో సమవుజ్జీగా నిలిచింది. కానీ, ఇక్కడ కచ్చితమైన స్మాష్‌లు, క్రాస్ కోర్టు డ్రాప్స్‌తో సింధు వరుసగా నాలుగు పాయింట్లు ఖాతాలో వేసుకుంది. తొలి గేమ్‌ను 21-17తో సొంతం చేసుకుంది. కీలక రెండో గేమ్‌లోనూ సింధు జోరు తగ్గలేదు. యమగూచిపై ఎదురుదాడి చేస్తూ పాయింట్లు సాధించింది. 8-3, 14-7తో ముందంజలోకి దూసుకెళ్లింది. యమగూచి 17-19తో రేసులోకి వచ్చే ప్రయత్నం చేసినా.. సింధు 21-17తో రెండో గేమ్‌తో పాటు జపాన్ ఓపెన్ టైటిల్‌ను ఎగరేసుకుపోయింది.

# జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కలకలం..

**మొదటిపేజీ తరువాయి**

వివరాల్లోకి వెళితే, అకాడమీలో శిక్షణ పొందుతున్న ఒక ఐపీఎస్ ప్రొబేషనర్, తన సహోద్యోగి అయిన ఉదయ్ కృష్ణారెడ్డి తనను కొంతకాలంగా వేధిస్తున్నాడని అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు తనకు అసభ్యకరమైన మెసేజ్‌లు పంపడంతో పాటు, మానసికంగా వేధిస్తూ, దుర్భాషలాడుతున్నాడని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ క్రమంలో జూలై 9న నిందితుడు తనను బలవంతంగా ఒక గదిలోకి లాక్కెళ్లాడని, జుట్టు పట్టుకుని మెడపై కత్తి పెట్టి బెదిరించాడని బాధితురాలు ఆరోపించారు. అంతేకాకుండా, ఆమె ప్రైవేట్ వీడియోలను బలవంతంగా చిత్రీకరించి, ఆమె మొబైల్ ఫోన్ లాక్కుని, ఆ వీడియోలను ఆమె భర్త వాట్సాప్‌కు పంపాడని ఫిర్యాదులో వివరించారు.బాధితురాలి ఫిర్యాదు స్వీకరించిన అత్తాపూర్ పోలీసులు, నిందితుడు ఉదయ్ కృష్ణారెడ్డిపై భారతీయ న్యాయ సంహిత (BNS)లోని సెక్షన్లు 74, 75, 77, 315(2)తో పాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని సెక్షన్ 66(C) కింద కేసు నమోదు చేశారు.

# తమ్మినేని భూ కబ్జా

**శ్రీకాకుళం, మన జనప్రగతి జులై 19 :**

గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతలు చేసిన అక్రమాలు బయటపడుతూనే ఉన్నాయి. స్పీకర్‌గా పనిచేసిన వైసీపీ నేత తమ్మినేని సీతారాం, ఆయన కుటుంబ సభ్యులు 4 కోట్ల రూపాయల విలువ చేసే భూమిని కబ్జా చేశారు. భూ యజమాని బతికుండగానే చనిపోయినట్టుగా మరణ ధ్రువీకరణ పత్రాలు సృష్టించారు. నకిలీ వారసులను చూపి తప్పుడు పత్రాలతో తమ్మినేని కుమారుడి పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ వ్యవహారంలో సబ్ రిజిస్ట్రార్ వంత పాడారు. ఇదంతా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023లో ఆయన స్పీకర్‌గా ఉన్నప్పుడే జరిగింది. ఇటీవల బాధితుడి ఫిర్యాదుతో కబ్జా బాగోతం వెలుగులోకి వచ్చింది. శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్‌లో తమ్మినేని సీతారాం (ఏ6)తో పాటు ఆయన భార్య తమ్మినేని వాణి (ఏ7), కుమారుడు తమ్మినేని వెంకట శ్రీరామ చిరంజీవి నాగ్ (ఏ5)పై కేసు నమోదు చేశారు. ఆదివారం శ్రీకాకుళం జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ కేసులో మొత్తం 13 మంది ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. 8 మందిని అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరు పరిచారు. నిందితుల నుంచి నకిలీ రబ్బరు స్టాంపులు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తమ్మినేని కుటుంబ సభ్యులతో పాటు మరో ఇద్దరు పరారీలో ఉన్నట్టు ఎస్పీ వెల్లడించారు. తమ్మినేని సీతారాం, తమ్మినేని వాణి, తమ్మినేని వెంకట శ్రీరామ చిరంజీవి నాగ్ (నాని), ఏ13 బొడ్డేపల్లి అరుణ (ప్రస్తుత హిరమండలం సబ్ రిజిస్ట్రార్), ఏ4 త్రినాథ్ కోసం గాలిస్తున్నామని, త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.

ఎస్పీ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం రూరల్ పరిధిలోని చాపురం గ్రామ పంచాయతీ బలగ పరిధిలో సర్వే నంబర్ 35/13లో ఉన్న 84, 85, 86 ప్లాట్లను (900 గజాల స్థలం) అంధవరపు గోవిందరాజులు అనే వ్యక్తి నుంచి కట్టా కనకలింగేశ్వరరావు అనే వ్యక్తి 1988, 1992లో రెండు దఫాలుగా కొనుగోలు చేశారు. లింగేశ్వరరావు కుటుంబం ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడింది. ఆ స్థలం చాలా కాలంగా ఖాళీగా ఉంటోంది. ప్రస్తుతం ఆ స్థలం విలువ రూ.3-4 కోట్లు ఉంటుంది. ఆ ఖాళీ స్థలంపై నిందితుల కన్ను పడింది. కనక లింగేశ్వరరావుకు భూమిని విక్రయించిన అంధవరపు గోవిందరాజుల లింక్ డాక్యుమెంట్‌లను పైకి తీశారు. గోవిందరాజులు బతికి ఉండగానే.. ఆయన చనిపోయినట్లు తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించారు. వాస్తవానికి గోవిందరాజులుకు ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. అయితే ఒడిశాలోని జయపుర్ ప్రాంతానికి చెందిన అడబాల రజనిని తెరపైకి తెచ్చారు. 'ఎ.రజని'గా రికార్డుల్లో చూపించి గోవిందరాజులకు ఏకైక వారసురాలుగా రెవెన్యూ అధికారుల నుంచి వారసత్వ ధ్రువీకరణ (ఫ్యామిలీ మెంబర్) పత్రాన్ని తయారు చేయించారు. వీటితో తప్పుడు రిజిస్ట్రేషన్ పత్రాలను రూపొందించారు. ఆమదాలవలస సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తమ్మినేని సీతారాం కుమారుడు తమ్మినేని చిరంజీవి నాగ్‌కు విక్రయించినట్లు రిజిస్ట్రేషన్ చేయించారు. తమ్మినేని సీతారాంకు చెందిన ఆమదాలవలసలోని ప్రైవేటు కళాశాలలో పనిచేస్తున్న నలుగురు లెక్చరర్లను ఇందుకు సాక్షులుగా సంతకం చేయించారు. ఇదంతా 2023లో జరిగింది. ఇటీవల ఆ స్థలానికి ప్రహరీ నిర్మించేందుకు యత్నించగా.. అసలు యజమాని కనకలింగేశ్వరరావు కుమారుడు కట్టా జైకిశోర్ పోలీసులను ఆశ్రయించారు. తమ వద్ద ఉన్న ఒరిజనల్ పత్రాలను పోలీసులకు సమర్పించారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టి అసలు గుట్టు రట్టు చేశారు.

# లిస్టు రెడీ..

**మొదటిపేజీ తరువాయి**

సీనియర్లు చెబుతున్నారు. కొత్తగా ఎన్నికైన వారితోపాటు కొందరు సీనియర్ల పనితీరు నిరాశజనకంగా ఉందని సీఎం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆయా ఎమ్మెల్యేలకు చెప్పినా వారు మారడం లేదన్నట్లు అధినేత భావిస్తున్నారు. వాళ్లతో పాటే అందరినీ ముంచేస్తారని ఆందోళన చెందుతున్న చంద్రబాబు 2029 ఎన్నికలకు 1999 ఫార్ములా తీసుకువస్తానని తాజాగా జరిగిన ఎంపీల సమావేశంలో స్పష్టం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. పార్లమెంటరీ పార్టీ సమావేశం సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరుపై చర్చ జరిగిందని, కొందరు ఎమ్మెల్యేలు తమ మాట వినడం లేదని సీనియర్ ఎంపీలు చెప్పగా సీఎం ఘాటుగా స్పందించినట్లు చెబుతున్నారు.

- భార్యల చేతిలో 554 మంది భర్తలు ఖతం.. కలియుగంలో ఇదో దారుణం ాాంజవతీఅంవఎవత్ పార్టీకి మంచి జరిగేలా అందరూ నడుచుకోవాలని, ఈ విషయంలో ఎలాంటి మొహమాటలకు తావు లేదని చంద్రబాబు వ్యాఖ్యానించినట్లు చెబుతున్నారు. పార్టీకి నష్టం చేస్తున్న వారికి ఇప్పటికే పలుమార్లు హెచ్చరించామని, ఇకపై అటువంటి మాటలు ఉండవని సీఎం తేల్చిచెప్పారని అంటున్నారు. దీంతో పార్టీలో వివాదాలు, విమర్శలు ఎదుర్కొంటున్న పలువురు ఎమ్మెల్యేలకు కౌంట్ డౌన్ మొదలైనట్లేనని వ్యాఖ్యానిస్తున్నారు. ఇకపై వారికి ఎటువంటి అవకాశం ఇవ్వమని చెప్పడం ద్వారా పార్టీలో ప్రభుత్వంలో ఆయా ఎమ్మెల్యేల ప్రాధాన్యం తగ్గించడమే కాకుండా వారిస్థానంలో ప్రత్యామ్నాయ నేతలను ప్రోత్సహించే పరిస్థితి ఉందని చెబుతున్నారు.

# జమ్మూ కశ్మీర్‌లో జల ప్రళయం..

**జమ్మూ మన జనప్రగతి జులై 19 :**

జమ్మూ కశ్మీర్‌లోని సరిహద్దు జిల్లాలు పూంచ్, రాజౌరీలలో ఆదివారం కురిసిన కుండపోత వర్షాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో మొత్తం 12 మంది మరణించారు. ఇంకా పలువురి ఆచూకీ తెలియరాలేదు. ఈ ప్రకృతి విపత్తు కారణంగా వందలాది ఇళ్లు, పాఠశాలలు ధ్వంసమవగా, భారీగా ఆస్తి నష్టం సంభవించింది.

అధికారుల వివరాల ప్రకారం, పూంచ్ జిల్లాలో 9 మంది మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. రాజౌరీ జిల్లాలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, ఇద్దరు గల్లంతయ్యారు, ఒకరు గాయపడ్డారు. గల్లంతైన వారి కోసం ఆర్మీ, పోలీసులు, స్థానిక బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ముఖ్యంగా పూంచ్ జిల్లాలోని సురన్‌కోట్ తహసీల్‌లో నష్టం తీవ్రంగా ఉంది.

ఈ రెండు జిల్లాల్లో కలిపి 130కి పైగా ఇళ్లు, 18 పాఠశాలలు, అనేక వాహనాలు దెబ్బతిన్నాయి. కొన్ని ప్రాంతాల్లో మొబైల్ కనెక్టివిటీ పూర్తిగా స్తంభించిపోయింది. వందలాది ఇళ్లకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. సుమారు 127 కనాల్స్ విస్తీర్ణంలో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా.విషయం తెలియగానే ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఢిల్లీలో తలపెట్టిన తన నిరసన కార్యక్రమాన్ని రద్దు చేసుకుని హుటాహుటిన జమ్మూకు చేరుకున్నారు. ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి సహాయక చర్యలను సమీక్షించారు. బాధితుల ప్రాణాలను కాపాడటమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ఇతర రాజకీయ నేతలు ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, బాధితులను ఆదుకోవడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

# ప్రైవేటుకు కట్టబెట్టే కుట్ర

**మొదటిపేజీ తరువాయి**

రూపాయల నష్టం కలిగించేందుకు సిద్ధమయ్యారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ చేస్తూ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు గుప్పించారు.

**మా హయాంలో పురోగతి... ఇప్పుడు ప్రైవేటుపరం**

నవ్యాంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి పోర్టులే కీలకమని భావించిన తమ ప్రభుత్వం, రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టుల నిర్మాణంలో గణనీయమైన పురోగతి సాధించిందని జగన్ గుర్తుచేశారు. ఈ మూడు పోర్టులకు సంబంధించి భూసేకరణ, అన్ని రకాల చట్టబద్ధమైన అనుమతులు, ఆర్థిక వనరుల సమీకరణ వంటి అత్యంత క్లిష్టమైన పనులన్నీ తమ హయాంలోనే పూర్తయ్యాయని ఆయన వివరించారు. ప్రాజెక్టుల పూర్తి కోసం ఈపీసీ కాంట్రాక్టులను కూడా ఖరారు చేసి, 2024 జూన్ నాటికి నిర్మాణ పనుల్లో చెప్పుకోదగ్గ పురోగతిని సాధించామని తెలిపారు. ఇంత కష్టపడి ఒక రూపు తీసుకొచ్చిన పోర్టును ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం అప్పనంగా ప్రైవేటుపరం చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు.

**పోర్టుతో ముడిపడిన భారీ ప్రాజెక్టులు**

రామాయపట్నం పోర్టు వల్ల రాష్ట్రానికి అపారమైన ఆర్థిక ప్రయోజనాలు చేకూరనున్నాయని జగన్ తన పోస్టులో ప్రస్తావించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) సుమారు రూ.1 లక్ష కోట్లకు పైగా పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్ పూర్తిగా రామాయపట్నం పోర్టుపైనే ఆధారపడి ఉందని తెలిపారు. ముడి చమురు దిగుమతికి ఈ పోర్టు కీలకం కానుందన్నారు.

అలాగే, ఇండోసోల్ సోలార్ సంస్థ ఏర్పాటు చేయనున్న గిగా స్కేల్ తయారీ ప్లాంటుకు కూడా ఈ పోర్టే ఆధారం అని తెలిపారు. ముడిసరుకుల దిగుమతికి, తయారైన సోలార్ మాడ్యూళ్ల ఎగుమతికి ఈ డీప్ వాటర్ పోర్టు అత్యంత అవసరమని పేర్కొన్నారు.వీటితో పాటు, వైఎస్సార్ కడప జిల్లాలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ నిర్మిస్తున్న ఉక్కు కర్మాగారానికి అవసరమైన ముడి ఇనుము, కోకింగ్ కోల్ వంటివి దిగుమతి చేసుకోవడానికి రామాయపట్నం పోర్టులో ఆ సంస్థ రెండు బెర్తులను అభివృద్ధి చేస్తోందని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టులన్నీ వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించడమే కాకుండా, రాష్ట్రానికి పన్నుల రూపంలో భారీ ఆదాయాన్ని సమకూరుస్తాయని జగన్ వివరించారు.

**రూ.3,500 కోట్ల నష్టానికి అమ్మకం**

ఇన్ని ఆర్థిక ప్రయోజనాలున్న రామాయపట్నం పోర్టును టీడీపీ ప్రభుత్వం ఓ భారీ స్కామ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తోందని జగన్ తీవ్రంగా ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.4,929 కోట్లు ఖర్చు చేసి నిర్మిస్తున్న ఈ పోర్టును, కేవలం రూ.1,500 కోట్ల ముందస్తు చెల్లింపులకే ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తోందని ఆయన విమర్శించారు. దీనివల్ల రాష్ట్ర ఖజానాకు తీరని నష్టం వాటిల్లుతుందని, మిగిలిన రూ.3,500 కోట్లకు పైగా అప్పుల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే మోయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ పెద్దలకు నగదు ప్రవాహాలు సృష్టించడమే ఈ కుట్ర వెనుక ఉన్న అసలు లక్ష్యమని ఆయన ధ్వజమెత్తారు.

# బిల్లులు పాసయ్యేనా

**మొదటిపేజీ తరువాయి**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు కొన్ని గంటల ముందు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో గందరగోళం చెలరేగింది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) రెబల్ ఎంపీలకు ఆహ్వానం పలకడాన్ని నిరసిస్తూ విపక్ష పార్టీల నేతలు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అయితే, ఇది కేవలం సాంకేతిక నిరసన మాత్రమేనని తెలిపి, కొద్ది నిమిషాలకే తిరిగి సమావేశంలో పాల్గొన్నారు.

సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల అజెండాను చర్చించేందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశం మొదలైన వెంటనే కాంగ్రెస్, టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, ఆప్, శివసేన (యూబీటీ) సహా పలు విపక్ష పార్టీల నేతలు నిరసనగా బయటకు వెళ్లిపోయారు.

టీఎంసీ నుంచి తిరుగుబాటు చేసిన సుమారు 20 మంది ఎంపీలు నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ)లో చేరారు. అయితే, ఈ విలీనానికి లోక్‌సభ స్పీకర్ నుంచి అధికారికంగా ఎలాంటి ఆమోదం లభించలేదని, పార్లమెంట్ రికార్డుల్లో వారు ఇంకా టీఎంసీ ఎంపీలుగానే ఉన్నారని విపక్షాలు వాదించాయి. పార్లమెంట్ వెబ్‌సైట్‌లో ఎన్‌సీపీఐ అనే పార్టీయే లేనప్పుడు వారిని ఎలా ఆహ్వానిస్తారని టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్ ప్రశ్నించారు. ఇది నిబంధనలను ఉల్లంఘించడమేనని విపక్షాలు ఆరోపించాయి.

ఈ పరిణామంపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ.. స్పీకర్ వద్ద గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్న పార్టీలను ఆహ్వానించడం తమ బాధ్యత అని తెలిపారు. మరోవైపు, తమకు ఆహ్వానం అందడాన్ని ఎన్‌సీపీఐ నేత కకోలి ఘోష్ దస్తిదార్ స్వాగతించారు. ఈ ఘటనతో వర్షాకాల సమావేశాలు వాడివేడిగా సాగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సమావేశాల్లో నీట్ పరీక్షల లీకేజీలు, వ్యవసాయ సమస్యలు, రామాలయ విరాళాల అంశాలను లేవనెత్తాలని విపక్షాలు సిద్ధమవుతున్నాయి.

# ప్రయివేటు యూనివర్సిటీలు ఎందుకు పెట్టారు?

**వాటి లక్ష్యాలు ఏంటి?**

**బోధనా సిబ్బంది విద్యార్హతలు..**

**ఎంట్రన్స్‌కు ఉన్న నిబంధనలేమిటి?**

**ప్రయివేట్ యూనివర్సిటీల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ప్రశ్నలు**

**పూర్తి వివరాలతో అఫిడవిట్ సమర్పించాలని ఆదేశం**

**సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలతో యూనివర్సిటీల్లో తనిఖీలు**



**హైదరాబాద్ మన జనప్రగతి జులై 19 :**

పెద్ద సంఖ్యలో ఏర్పాటవుతున్న ప్రయివేటు యూనివర్సిటీల వెనుక ఉన్న అసలు ఉద్దేశాలు, వాటిని ఏర్పాటు చేస్తున్న సంస్థలు/ వ్యక్తుల అసలు లక్ష్యాలు ఏమిటి..? ఆ యూనివర్సిటీల్లో బోధిస్తున్న వారికి ఉన్న విద్యార్హతలు ఏమిటి అనే దానిపై సర్వోన్నత న్యాయస్థానం దృష్టి సారించింది. అయేషా జైన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు విచారణలో తన దృష్టికి వచ్చిన అనేక ఫిర్యాదులను పరిశీలించిన సుప్రీంకోర్టు దేశవ్యాప్తంగా ప్రయివేట్ యూనివర్సిటీల్లో తనిఖీలకు ఆదేశిం చింది. ప్రయివేట్ యూనివర్సిటీలు ఏకపక్షం గా వ్యవహరిస్తుండడంతో అసలు వాటి ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశాలు మొదలు వాటిలో అందుతున్న విద్యా ప్రమాణాల స్థాయి వరకు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి పూర్తి వివరాలతో అఫిడవిట్లు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు యూనివర్సిటీల్లో తనిఖీల కోసం కాలేజీయేట్ ఎడ్యుకేషన్ చైర్మెన్ అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీలో కన్వీనర్‌గా తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యదర్శి, సభ్య కన్వీనర్‌గా జేఎన్‌టీయూ రిజిస్ట్రార్, సభ్యులుగా పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్, ఉస్మానియా యూనివర్సిటీ చీఫ్ ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్, టెక్నికల్ ఎడ్యుకేషన్ విద్యా కమిషనర్ అసిస్టెంట్ డైరెక్టర్ (అకడమిక్-సి)లను నియమించింది.

అవసరమైతే ఒక సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌ను నియమించుకునే అవ కాశాన్ని కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది.

# సర్ పై దృష్టి

**మొదటిపేజీ తరువాయి**

ఆయన తెలిపారు. ఆదివారం టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన సర్ పై నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్ ప్రక్రియను తేలిగ్గా తీసుకోవద్దని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 119 నియోజకవర్గాల్లో ఎస్ఐఆర్‌పై 489 సమావేశాలు జరిగాయని సీఎం తెలిపారు. బాగా వెనుకబడిన నియోజకవర్గాల్లో ఇప్పటికైనా స్పందించాలని సూచించారు. చైర్మెన్ పదవులు, పార్టీ పోస్టులు కావాలని గాంధీభవన్ చుట్టూ తిరగొద్దని ఆశావహులను కోరారు. అలాంటి వారికి అపాయింట్‌మెంట్లు ఇవ్వొద్దని నాయకులకు దిశా నిర్దేశం చేశారు. కొందరు నాయకులు హైదరాబాద్‌లో కూర్చొని పనిచేయడం లేదని ఆయన తప్పుపట్టా రు. సోమవారం పది మంది ఇంచార్జి మంత్రు లు అన్ని జిల్లాల్లో సర్ పై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తారని సీఎం వెల్లడించారు.

పార్లమెంట్ సమావేశాల్లో ఉన్నప్పటికీ ఎంపీలు ఎప్పటికప్పుడు సమీక్షలు జరపాలన్నారు. ఇంచార్జిలుగా వ్యవహరిస్తున్న చోట ఎంపీలు పనిచేయకపోతే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. పార్టీ పరంగా సర్ ఇంచార్జిలుగా ఉన్నవారు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని సూచించారు.ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జిలు, చైర్మెన్లు బీఎల్ఓల రిపోర్టుల కంటే బీఎల్ఏల రిపోర్టులను ఎక్కువగా పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. బీఎల్ఓల రిపోర్టుల మీద మాత్రమే ఆధారపడితే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. పార్టీ పరంగా పని చేస్తున్న బీఎల్ఏలను నాయకులు సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరు పూర్తిగా క్షేత్రస్థాయిలో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. వచ్చే పది రోజులు ఎన్నికల ప్రచారం తరహాలో నియోజకవర్గాల్లో పర్యటించాలనీ, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇంచార్జిలు, కార్పొరేషన్ చైర్మెన్లు, సర్ కోసం నియమించిన పార్టీ ఇంచార్జిలు అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందేనని తేల్చి చెప్పారు.

## “1100 కాల్ సెంటర్“ సేవలు వినియోగించుకోండి: డీఆర్వో మల్లికార్జునుడు



**కడప,మన జనప్రగతి జులై 19 :-** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం అందుబాటులో ఉంచిన “1100 కాల్ సెంటర్“ సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో మల్లికార్జునుడు కోరారు. ఈ నెల 20వ తేదీన సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి సోమవారం ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు నిర్వహించే డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో 08562-244437 ల్యాండ్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని తెలిపారు. గతంలో ఇచ్చిన అర్జీల వివరాలు తెలుసుకోవడానికి 1100కు కాల్ చేయవచ్చని, అలాగే పీజీఆర్ఎస్‌కు వచ్చే వారు పాత అర్జీ రసీదు ఉంటే.. వెంట తీసుకురావాలని డీఆర్వో సూచించారు

## పరిశ్రమల రాకతో స్థానికంగానే ఉద్యోగాలు: మంత్రి సవిత



**హిందూపురం, మన జనప్రగతి, జూలై 19:-** రాష్ట్ర వ్యాప్తంగా పరిశ్రమల ఏర్పాటుతో ఉన్నత విద్య పూర్తి చేసిన యువతకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. హిందూపురంలో ఈడిగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో ఆమె మాట్లాడుతూ, బీసీ విద్యార్థులకు సివిల్ సర్వీసెస్, డీఎస్సీ, గ్రూప్-2 తదితర పోటీ పరీక్షలకు బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. గీత కార్మికుల అభివృద్ధి కోసం రాష్ట్రవ్యాప్తంగా నీరా యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్, లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీ, 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన ఈడిగ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, ల్యాప్‌టాప్‌లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కిరణ్ కుమార్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం): జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

**మదనపల్లి,మన జనప్రగతి జూలై 19:-**ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు జూలై 20న సోమవారం ఉదయం 10.00గం.ల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలను జిల్లా కలెక్టరేట్ కు వచ్చే అవసరం లేకుండా meekosam.ap.gov.in వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చని, వారి యొక్క అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల యొక్క ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నెంబర్ను సంప్రదించగలరని ఆ ప్రకటనలో పేర్కొన్నారు అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

## ఆదోని సబ్ రిజిస్టర్ కార్యాలయం పై ఏసీబీ అధికారులు దాడులు.


**కార్యాలయంలో అనధికార వ్యక్తులను అదుపులోకి తీసుకున్న అధికారులు.**

**రూ.1.18, లక్షల అనధికార సొమ్ము స్వాధీనం చేసుకున్న కెసిపి అధికారులు.**



**ఆదోని మన జనప్రగతి జూలై 19:-** ఆదోని సబ్ రిజిస్టర్ కార్యాలయం పై ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. శనివారం సాయంత్రం ఏసీబీ అధికారులు దాడుల విషయాన్ని తెలుసుకున్న కార్యాలయ పరిసర ప్రాంతాల్లోని డాక్యుమెంట్ రైటర్ల దుకాణాలన్నీ మూసివేశారు. ఆదోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అధికంగా సొమ్ము వసూలు చేస్తున్నారని ఫిర్యాదు రావడంతో ఈ దాడులు నిర్వహించామని డిఎస్పి సీతారామారావు తెలిపారు. అధికారులు దాడులు నిర్వహించిన సమయంలో ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగుల్లో కాదని,7 మంది అనధికార వ్యక్తులు కార్యాలయంలో ఉన్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి రూ.1.18 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న నగదు కార్యాలయానికి సంబంధించినదా..? లంచంగా తీసుకున్నదా..? అనే విషయంపై విచారణ చేస్తున్నామని ఏసీబీ డిఎస్పి సీతారామారావు తెలిపారు. పూర్తి నివేదిక పై అధికారులకు తెలిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

## శాఖాంబరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన ముత్యాలమ్మ వారు



**కాకినాడ,మన జనప్రగతి జూలై 19:-** కాకినాడ సామర్లకోట కెనాల్ రోడ్డులో ఉన్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారు ఆదివారం ఆషాడం నవరాత్రుల సందర్భంగా భక్తులకు శాకాంబరి అవతారంలో దర్శననిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూర గాయలు, ఆకు కూరలతో అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించి పూజలు చేశారు. ఈ శాఖాంబరి అవతారంకు దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పలు రకాల సౌకర్యాలు, తగు ఏర్పాట్లు కల్పించామని ఆలయ కార్యనిర్వాహణాధికారి బిక్కిన వెంకటరాయ చౌదరి తెలిపారు. మొదటి ఆదివారం కావడంతో అమ్మవారి దర్శన నిమిత్తం భక్తులు అధిక సంఖ్యలో హాజరైనట్లు చౌదరి చెప్పారు.

## పట్టణం పరిశుభ్రంగా ఉందని ప్రజలు చెబితే...! పట్టాభి ఇంట్లో మూడేళ్లు పనిచేస్తా“ రాచమల్లు సవాల్



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 19:-** స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ చేసిన వ్యాఖ్యలను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఆదివారం దొరసానిపల్లెలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి పాలనలో రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా, ప్రొద్దుటూరు స్వచ్ఛ పట్టణంగా మారిందన్న వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని విమర్శించారు. కంపోస్టు యార్డులు ఏర్పాటు చేస్తేనే పట్టణం పరిశుభ్రంగా మారదని పేర్కొన్న ఆయన, పారిశుధ్యంపై ప్రజల అభిప్రాయం తీసుకోవడానికి తాను సిద్ధమని అన్నారు. ప్రజలు పారిశుధ్యం బాగుందని చెబితే పట్టాభి ఇంట్లో మూడేళ్లు పారిశుధ్య పనులు చేసేందుకు సిద్ధమని, లేదంటే తన ఇంట్లో అదే పని చేయడానికి పట్టాభి సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. టీడీపీ నాయకులు ప్రతి సమావేశంలోనూ వైఎస్ జగన్ పేరును ప్రస్తావించడం అలవాటుగా మార్చుకున్నారని రాచమల్లు విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రత్యేక సిబ్బంది, వాహనాలతో ఇంటింటికీ చెత్త సేకరణ చేపట్టి రోజుకు ఒక్క రూపాయి మాత్రమే వసూలు చేస్తూ పారిశుధ్యాన్ని మెరుగుపరిచామని తెలిపారు. ప్రస్తుతం చెత్త పన్ను ఎత్తివేశామని చెబుతూ ప్రజలపైనే ఇతర రూపాల్లో భారం మోపుతున్నారని ఆరోపించారు. వైఎస్సార్ మరణం తర్వాత జగన్ చేపట్టిన ఓదార్పు యాత్ర, అనంతరం ప్రజా సంకల్ప యాత్ర ద్వారా ప్రజలకు చేరువై అధికారంలోకి వచ్చారని, సంక్షేమ పాలన అందించారని అన్నారు. ప్రస్తుతం కూడా ప్రజల సమస్యలపై పోరాడుతున్న నాయకుడిగా జగన్ కొనసాగుతున్నారని పేర్కొన్నారు. కడప జిల్లా ఎప్పటికీ వైఎస్సార్ కుటుంబానికి అండగా ఉంటుందని, గత ఎన్నికల్లో కూటమి పార్టీలన్నీ కలిసి పోటీ చేసినా వచ్చిన ఓట్లకు సమానంగా జగన్‌కు ఒంటరిగా భారీగా ఓట్లు వచ్చాయని తెలిపారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు, బుగ్గవంక రక్షణ గోడ, సున్నపురాళ్లపల్లె స్టీల్ ప్లాంట్ చర్యలు, కొప్పర్తి పారిశ్రామికవాడ అభివృద్ధి, కడప విమానాశ్రయ విస్తరణతో పాటు పలు పరిశ్రమలు, వైద్య విద్యాసంస్థల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. అమరావతి, రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని రాచమల్లు స్పష్టం చేశారు. ప్రజలకు వాస్తవాలు తెలుసునని, అబద్ధపు ప్రచారాలతో వారిని మభ్యపెట్టడం సాధ్యం కాదని అన్నారు.

## తల్లికి వందనం పథకం పేరుతో వచ్చే నకిలీ లింకుల పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

### సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోవద్దు: ఎస్పీ విక్రాంత్ పాటిల్.

**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జులై 19:-** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న “తల్లికి వందనం“ పథకం పేరుతో సైబర్ నేరగాళ్లు విద్యార్థుల తల్లిదండ్రులను లక్ష్యంగా చేసుకుని నకిలీ లింకులు పంపి మోసాలకు పాల్పడే అవకాశం ఉందని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పథకానికి సంబంధించిన దరఖాస్తులు, అర్హత వివరాలు, నగదు జమ తదితర అంశాల పేరుతో వాట్సాప్, ఎస్ఎంఎస్ లేదా సోషల్ మీడియా ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. అటువంటి లింకుల ద్వారా బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్ నంబర్, ఓటీపీలు, పాస్‌వర్డు వంటి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి సైబర్ మోసాలకు పాల్పడే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం కోసం అధికారిక ప్రభుత్వ వేదికలు, స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు కార్యాలయాలను లేదా సంబంధిత అధికారులను మాత్రమే సంప్రదించాలని సూచించారు. కేవలం ప్రభుత్వ అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలన్నారు. తెలియని వ్యక్తులు పంపిన లింకులను నమ్మవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఏటీఎం వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డు ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in పోర్టల్ లో లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు.



## అన్యాయం జరిగితే నేరుగా జగనన్నకే ఫిర్యాదు

### ● పులివెందులలో “జగన్ 2.0 యాప్“ పోస్టర్ లాంచ్




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 19:-** పులివెందులఆదివారం స్థానిక భాకరాపురంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు భరోసాగా పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి రూపొందించిన “జగన్ 2.0 సూపర్ యాప్” పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తొండూరు మండల ఇంచార్జి వైయస్ మదన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భగా మదన్ మోహన్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం తాము ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలను,హామీలను నెరవేర్చకుండా ప్రజలను తీవ్రంగా మభ్యపెడుతోందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ,ప్రజలకు ఇచ్చిన మాటను ఎందుకు నిలబెట్టుకోలేకపోతున్నారు?“ అని ప్రశ్నిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో చట్టాన్ని పక్కనబెట్టి,రెడ్ బుక్ రాజ్యాంగం‘తెచ్చి అక్రమ కేసులు,అన్యాయాలు, దౌర్జన్యాలతో వేధింపులకు గురిచేస్తున్న తరుణంలో వీటన్నింటికీ చెక్ పెట్టేందుకే వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ “జగనన్న 2.0“ సూపర్ యాప్‌ను విడుదల చేశారని స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులకు రక్షణగా ప్రజల సమస్య ల పరిష్కార వేదికగా ఈ డిజిటల్ అస్త్రాన్ని వైఎస్సార్సీపీ అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్సీపీ కార్యకర్తలకు గానీ,సామాన్య ప్రజలకు గానీ పోలీసు వర్గాల ద్వారా లేదా అధికార కూటమి నాయకుల ద్వారా ఎలాంటి అన్యాయం జరిగినా ఈ యాప్ ద్వారా నేరుగా ఫిర్యాదు చేయవచ్చు అని ఈ సమాచారం నేరుగా పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి,అలాగే ఆయా నియోజకవర్గాల ఇంచార్జీలకు క్షణాల్లో చేరుతుందన్నారు. కేవలం రాజకీయ వేధింపులే కాకుండా గ్రామాల్లో,ఊర్లలో, వార్డుల్లో మరియు తాలూకా స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ఎలాంటి సమస్యలనైనా ఈ యాప్ ద్వారా నేరుగా పార్టీ దృష్టికి తీసుకురావచ్చన్నారు. పార్టీ కార్యకర్తలకు ఎక్కడ,ఏ అధికారి వల్ల లేదా ఏ వ్యక్తి వల్ల అన్యాయం జరిగినా ఆ వివరాలను యాప్ ద్వారా పార్టీ కార్యాలయానికి పంపించవచ్చు అని ఆ వివరాలన్నింటినీ పార్టీ రికార్డు (నోట్) చేసి పెట్టుకుంటుందన్నారు. రేపు వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు అక్రమాలకు,ఇబ్బందులకు గురిచేసిన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు,కార్యకర్తలకు న్యాయం చేసేందుకు ఈ సమాచారం ఉపయోగపడుతుందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే అధికారిక కార్యక్రమాలు,సోషల్ మీడియా అప్‌డేట్లు,ఫేస్‌బుక్ వంటి ప్లాట్‌ఫామ్‌ల సమాచారాన్ని ఈ యాప్ ద్వారా నేరుగా తెలుసుకోవచ్చును అని మనం మొబైల్ ఫోన్లలో ఫేస్‌బుక్,ఇన్‌స్టాగ్రామ్,వాట్సాప్ వంటి యాప్‌లను ఎంత సర్వసాధారణంగా వాడుతున్నామో అదే విధంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రతి ఒక్క కార్యకర్త,నాయకుడు తమ మొబైల్స్‌లో ఈ “జగనన్న 2.0“ సూపర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని పార్టీ పిలుపునిచ్చింది. నియోజకవర్గ,తాలూకా స్థాయిలోని ప్రతి ఒక్క కార్యకర్త మొబైల్‌లో ఈ యాప్ ఉండేలా చూసుకోవాలని పేరుపేరునా కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప,పట్టణ కన్వీనర్ గంగాధర్ రెడ్డి,మాజీ కౌన్సిలర్లు పార్లపల్లి కిషోర్, కోడి రమణ,ఖాదర్ బాషా, హఫీజుల్ల,మస్తాన్, చంద్రమౌళి,కొంగనపల్లె మురళి,లింగాల మండల నాయకులు బాబు రెడ్డి,చంద్రశేఖర్ రెడ్డి,వేముల మండల నాయకులు సాంబశివారెడ్డి,అంజనప్ప మరియు ఇతర వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 8వ జగద్గురువుకు బీజేపీ నేతల ఘన నివాళి

**ఉరవకొండ మన జనప్రగతి జూలై 19:-**గవి మఠం 8వ పీఠాధిపతి,జగద్గురువు శ్రీ చెన్న బసవ రాజేంద్ర మహాస్వామి (98) అనారోగ్యంతో బళ్లారిలో శనివారం కన్నుమూశారు. అనంతరం స్వామివారి పార్థివదేహాన్ని ఉరవకొండలోని కరిబసవ గవి మఠ సంస్థానానికి తీసుకువచ్చారు. స్వామివారి పార్థివదేహాన్ని దర్శించేందుకు భక్తులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి మూడ్ కేశవ నాయక్, బీజేపీ సీనియర్ నాయకుడు లాలెప్ప స్వామివారి పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించి, ఘనంగా నివాళులర్పించారు. జగద్గురువు శ్రీ చెన్న బసవ రాజేంద్ర మహాస్వామి సమాజానికి అందించిన ఆధ్యాత్మిక సేవలు



చిరస్మరణీయమని కొనియాడిన వారు, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మఠం భక్తులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి



**తిరుపతి మన జనప్రగతి జూలై 19:-** ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ. సి) శారదా దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో జూలై 20 వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి తెలియజేశారు.

## ట్రిపుల్ ఐటీకీ ఉషాకిరణ్ విధ్యార్ది ఎంపిక

### ఉన్నత చదువులతో భవిష్యత్ కి బాటలు వేయాలి

### కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి



**వేంపల్లె మన జనప్రగతి జూలై 19:-**స్థానిక ఉషాకిరణ్ ఉన్నత పాఠశాలకు చెందిన విధ్యార్థి సిఎస్ మహమ్మద్ ఇంతియాజ్ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకీ ఎంపికైనట్లు కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి వెల్లడించారు. పదోతరగతి - 2026 ఫలితాల్లో విధ్యార్థి ఇంతియాజ్ 588 మార్కులతో ప్రతిభ కనబరిచాడు. దీంతో ఆర్జీయూకేటి యూజీ-26 శ్రీకాకుళం క్యాంపస్ కి ఎంపిక కావడం పట్ల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఉన్నత చదువులు చదివి భవిష్యత్ కి బాటలు వేయాలని, ఉన్నత స్థాయికి అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే తల్లిదండ్రుల కలలను సాకారం చేసి పాఠశాలకు గుర్తింపు తేవాలని కోరారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో అన్నదానం




**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జూలై 19:** లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో సిబ్యాల గ్రామం బలిజపల్లి వాస్తవ్యులు కీ:శే గుగ్గిళ్ళ వెంకట రమణ మూడవ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు గంగాధర్,వెంకటేష్ ఆర్థిక సహాయంతో ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అధ్యక్షులు లయన్ యస్.అంజి రెడ్డి తెలిపారు.అనంతరం దాతలు గంగాధర్, వెంకటేష్ మాట్లాడుతూ మా తండ్రి కి:శే గుగ్గిళ్ళ వెంకట రమణ మూడవ వర్ధంతి సందర్భంగా మా వంతుగా ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ షేక్.మహమ్మద్,మాజీ అధ్యక్షులు లయన్ పసుపులేటి శ్యామ్,దాత కుటుంబ సభ్యులు మరియు ఆశ్రమం మేనేజర్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఏపీని గ్లోబల్ వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతాం: మంత్రి కందుల దుర్గేష్



**జైపూర్ మన జనప్రగతి జనప్రగతి, జూలై 19:-** ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ స్థాయి వెడ్డింగ్ డెస్టినేషన్‌గా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన ఇంటర్నేషనల్ వెడ్డింగ్ అండ్ టూరిజం కాన్‌క్లేవ్‌లో పాల్గొన్న మంత్రి దుర్గేష్ ప్రముఖ వెడ్డింగ్ ప్లానర్లు, ఈవెంట్ నిర్వాహకులతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. పెట్టుబడులు పెట్టే వారికి సింగిల్ విండో విధానంలో అనుమతులు, ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు.విశాఖ బీచ్‌లు, అరకు, కోనసీమ, మారేడుమిల్లి, తిరుపతి వంటి ప్రాంతాలు వెడ్డింగ్ టూరిజానికి అనువైన గమ్యస్థానాలని మంత్రి వివరించారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడంతో పాటు 2024-29 పర్యాటక విధానంలో పెట్టుబడిదారులకు పలు రాయితీలు అందిస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో ఏపీ పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, పర్యాటక, హాస్పిటాలిటీ రంగ ప్రతినిధులు, వెడ్డింగ్ డెస్టినేషన్ మేనేజర్లు, పెట్టుబడిదారులు పాల్గొన్నారు.

## ప్రార్థించే పెదాల కంటే సేవ చేసే చేతులు మిన్న: మాజీ రాజ్యసభ సభ్యుడు డా.తులసిరెడ్డి



**వేంపల్లె మన జనప్రగతి జూలై 19:-** ప్రార్ధించే పెదాల కంటే సేవ చేసే చేతులు మిన్న, పరుల సేవలో పరమాత్ముని సేవ అని మాజీ రాజ్యసభ సభ్యుడు డా.తులసిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక అమ్మ అనాధ వృద్ధాశ్రమం 29వ వార్షికోత్సవ వేడుకల్లో తులసిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నిర్వాహకుడు వెంకట సుబ్బయ్య కు శాలువతో ఘనంగా సత్కరించారు. మానవ సేవలో.. వృద్ధుల సేవ మరింత విశిష్టమైనదని తులసిరెడ్డి తెలిపారు. ఎటువంటి ప్రభుత్వ సహకారం లేకుండా కేవలం దాతల సహకారంతో వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్న వెంకట సుబ్బయ్య ను కొనియాడారు. సేవాతత్వం కలిగిన వారిని ప్రభుత్వం గుర్తించి తగిన ప్రోత్సాహకత అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమ సిబ్బంది కుమారి, పద్మావతి, ఉషారాణి, చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, అమర్, ఉత్తన్న, రవీంద్రారెడ్డి, రమణ, నాగరాజు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వారి ఆశయాలకు అనుగుణంగానే ఐడియల్ కళాశాల నిర్వహణ

### - ఘనంగా పదవీ విరమణ సిబ్బంది ఆత్మీయ సమ్మేళనం



**కాకినాడ,మన జనప్రగతి జూలై 19:-** 1970లో ఎన్నో ఆశయాలతో ఆలోచనలతో ఏర్పాటు చేసిన ఐడియల్ కళాశాల ఆ వ్యవస్థాపకుల ఆలోచనలకు అనుగుణంగానే విద్యను అందిస్తున్నామని కళాశాల పరిపాలనాధికారి జీవీకే వర్మ తెలిపారు. ఆదివారం కాకినాడబి సామర్లకోట రోడ్డులో ఉన్న ఐడియల్ కళాశాలలో ఇప్పటి వరకు పదవీ విరమణ చేసిన కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అపూర్వ ఆత్మీయ సమ్మేళనంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుదూర ప్రాంతాల నుంచి సుమారు 70 నుంచి 85 ఏళ్లకు పైగా వయసున్న వారు హాజరై కళాశాలపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. వారు కలిసి పనిచేసిన అనుభవాలను నెమరు వేసుకుని తియ్యటి జ్ఞాపకాలతో కన్నీటి పర్యంతమయ్యారు. నాడు మూడు వందల రూపాయల వేతనంతో ప్రారంభమైన తమ జీవితం పదవి విరమణ తర్వాత సుమారు లక్ష రూపాయల వరకు ఫించన్ అందుతోందని అందువల్ల కళాశాలకు రుణపడి ఉన్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. హాజరైన వారి అనుభవాలను కుటుంబ విషయాలను ఒకరికి ఒకరు పంచుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల పాలనాధికారి జీవీకే వర్మ మాట్లాడుతూ ఒక మంచి ఆలోచనతో అప్పటి సమాజానికి అవసరమయ్యే విద్యావసరాలను దృష్టిలో పెట్టుకొని ఐడియల్ కళాశాలను పివిఎన్ రాజు, ఎన్ఎస్ఆర్ శాస్త్రి, పి చిరంజీవిని కుమారిలు ప్రారంభించారని చెప్పారు. వారి ఆశయాలు అనుగుణంగానే జూనియర్ కళాశాలగా ప్రారంభమై డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ వంటి కోర్సులను అందించి ఎందరో విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకొచ్చిందని చెప్పారు. సుమారు 4వేల 5వందల మంది విద్యార్థులు ఐడియల్ కళాశాలలో విద్యని అభ్యసిస్తున్నట్లు వర్మ చెప్పారు. త్వరలోనే మరో ఆత్మీయ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు.

## ఏపీఆర్ఎస్ రెసిడెన్షియల్ స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఏఐఎస్ఎఫ్ నాయకులు



**పత్తికొండ మన జనప్రగతి జులై 19 :-** పట్టణంలోని ఏపీఆర్ఎస్ ఏపీ ఆర్ ఎ(సెసిడెన్షియల్ స్కూల్లో ఈరోజు ఏఐఎస్ఎఫ్ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పత్తికొండ మండల కార్యదర్శి శివ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషకాహారం అందించాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కోరారు.అదేవిధంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కన్వీనర్ సంతోష్, హరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలతో సైకిళ్ల పంపిణీ తాత్కాలిక వాయిదా: మంత్రి నారాయణ



**నెల్లూరు, మన జనప్రగతి, జూలై 19:-** వర్షాల కారణంగా నెల్లూరు నగరంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేపట్టిన సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు.వీఆర్సీ మైదానంలో వర్షపు నీరు చేరడంతో ఏర్పాట్లను మంత్రి స్వయంగా పరిశీలించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం జరగాల్సిన తొలి విడత పంపిణీని వాయిదా వేస్తున్నామని, వాతావరణం అనుకూలిస్తే ఈ నెల 24 లేదా 25 తేదీల్లో సైకిళ్ల పంపిణీ చేపడతామని వెల్లడించారు.మంత్రి నారాయణ సొంత నిధులతో రూ.6 కోట్ల వ్యయంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10 వేల మంది పేద విద్యార్థులకు సైకిళ్లు అందించనున్నారు. తొలి విడతలో 8, 9, 10వ తరగతుల 7 వేల మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేయనున్నారు.కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, బీజేపీ నేత కర్నాటి ఆంజనేయ రెడ్డి, కమిషనర్ నందన్, డీఈఓ బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

## ఒక జి ఓ ఒకరికి వారం మరొకరికి శాపం

- ఫ్రీ ముసుగులో ఇసుక దందా
- అడుగంటిన భూగర్భ జలాలు - ఆవేదనలో మండల రైతులు
- ఫిర్యాదు చేసినా స్పందించని వైనం
- కరువు కోరల్లోనికి మండల రైతులు




**వీరబల్లి మన జనప్రగతి జూలై 19:-** కబ్జాదారుల రూటే సపరేటు అన్నచందంగా ప్రభుత్వం ఫ్రీ ఇసుక కు సంబంధించి ఒక జీవో ఇస్తే అది వీరి పాలిట వరమైనట్లు మండల ఇసుకసురులను చూస్తే తెలుస్తోంది. మండలంలో మాండవ్య నది ప్రవహించడంతో నదికి ఇరువైపులా ఉన్న పొలాలు ఇంతకుముందు పచ్చదనంతో కలకలలాడుతూ ఉండేవి కాగా ప్రభుత్వం ఇసుకను ఫ్రీ చేయడంతో అది ఇసుకసురుల పాలిట వరంగా మారింది అది చివరకు మండలంలోని రైతుల పాలిటి శాపంగా మారుతోంది. గడచిన రెండేళ్లలో ఇసుకాసురులు ఇసుకను మండలం నుంచి తరలించి కోట్లకు పడగలెత్తగా మాండవ్య నది పరిసర ప్రాంతాల్లోని రైతులు మాత్రం తమ పొలాలకు నీరు లేక నానా ఇబ్బందుల పెడుతున్న దృశ్యం మండలంలో తాండవిస్తోంది. మండలంలోని పెద్దివీడు పరిసర ప్రాంతాల్లో అక్రమ ఇసుక తవ్వకం, రవాణా రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నదులు, వాగుల నుంచి అనుమతులు లేకుండానే ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకెళితేస్థానికుల కథనం ప్రకారం, పలుమార్లు రెవెన్యూ, గనుల శాఖ, పోలీసు అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదని వారు వాపోతున్నారు. దీంతో అక్రమ ఇసుక రవాణాదారులు నిర్భయంగా తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారని ఆరోపిస్తున్నారు.క్రమ ఇసుక తవ్వకాల కారణంగా వాగులు, నది తీరాలు దెబ్బతింటున్నాయని, భూగర్భ జలాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గ్రామీణ రహదారులపై భారీ వాహనాల రాకపోకల వల్ల రోడ్లు దెబ్బతింటున్నాయని, ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. జిల్లా యంత్రాంగం వెంటనే జోక్యం చేసుకుని అక్రమ ఇసుక తవ్వకం, రవాణాపై ప్రత్యేక దాడులు నిర్వహించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కూడా విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రభుత్వ సెలవు దినమైన ఆదివారం ప్రత్యేక తరగతులు నిర్వహించడం తగదు



**పీలేరు మన జనప్రగతి జూలై 19:-** ప్రభుత్వ సెలవు దినమైన ఆదివారం పీలేరు శ్రీ చైతన్య పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారనే సమాచారంతో NSUI రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ, జనసేన విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు బాటసారి, NSUIజిల్లా అధ్యక్షులు సాయి సంపత్ కుమార్ పాఠశాలను సందర్శించి ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు.ప్రభుత్వ సెలవు రోజున విద్యార్థులను పాఠశాలకు రప్పించి ప్రత్యేక తరగతులు నిర్వహించడం సరికాదని, విద్యార్థుల హక్కులు, వారి శారీరకమానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే తరగతులను నిలిపివేయాలని సూచించారు. దీనికి స్పందించిన ప్రిన్సిపాల్ ప్రత్యేక తరగతులను తక్షణమే నిలిపివేసి విద్యార్థులను ఇళ్లకు పంపించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు విశ్రాంతి కూడా అంతే ముఖ్యమని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన సెలవు దినాలను ప్రతి విద్యాసంస్థ గౌరవించాలని, పరీక్షల పేరుతో లేదా ప్రత్యేక తరగతుల పేరుతో సెలవు రోజుల్లో విద్యార్థులపై అనవసరమైన మానసిక, శారీరక ఒత్తిడి తీసుకురావడం సమంజసం కాదని పేర్కొన్నారు.అదేవిధంగా, ప్రత్యేక తరగతుల పేరుతో అధిక ఫీజుల వసూళ్లకు అవకాశం కల్పిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపేందుకు, అధిక ఫీజులను సమర్థించుకునేందుకు ఇలాంటి ప్రత్యేక తరగతులను ఒక ఎత్తుగడగా ఉపయోగిస్తున్నట్లు తాము భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.ఈ ఘటనపై విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టి, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే భవిష్యత్తులో ప్రభుత్వ సెలవు దినాల్లో ఎలాంటి విద్యాసంస్థలు ప్రత్యేక తరగతులు నిర్వహించకుండా పటిష్టమైన పర్యవేక్షణ చేపట్టాలని కోరారు.విద్యను వ్యాపారంగా కాకుండా సేవాభావంతో అందించాలని, విద్యార్థుల సంక్షేమం, తల్లిదండ్రుల ప్రయోజనాలు, విద్యా వ్యవస్థలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని నాయకులు పేర్కొన్నారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
20 - 07 - 2026

# శ్రీ శీతల గంగమ్మ జాతరకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు

● ఏర్పాట్లను పరిశీలించిన ఒంటిమిట్ట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ హారిక



**సిద్ధవటం మన జనప్రగతి, జూలై 19:–** సిద్ధవటం మండలం మాధవరం–1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతీపురంలో ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించనున్న శ్రీ శీతల గంగమ్మ అమ్మవారి 23వ వార్షిక జాతర బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆదివారం ఒంటిమిట్ట సీఐ వెంకటేశ్వర్లు, సిద్ధవటం ఎస్ఐ హారిక పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించడంతో పాటు జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. జాతర సందర్భంగా ప్రత్యేక పోలీసు కంట్రోల్ రూం ఏర్పాటు చేసి పటిష్టమైన పోలీసు బందోబస్తు కల్పిస్తామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు జాతర నిర్వహణకు సంబంధించిన వివరాలను అధికారులకు తెలియజేసి, పోలీసు శాఖకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీలేఖ భర్త, జనసేన యువ నాయకుడు దేరంగుల శ్రీకాంత్, రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శి అవ్వారు రవిశంకర్, ఆలయ కమిటీ సభ్యులు బిట్టా వెంకటేశు, చీరాల సుబ్బరాయుడు, నల్లు నరేష్, సుధా మురళి తదితరులు పాల్గొన్నారు.

# స్వార్థపరులు పార్టీని వీడితే వైఎస్సార్‌సీపీకి నష్టం లేదు: గడికోట శ్రీకాంత్ రెడ్డి



**రాయచోటి, మన జనప్రగతి, జూలై 19:–** స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీని వీడే నాయకులతో వైఎస్సార్‌సీపీకి ఎలాంటి నష్టం లేదని, ప్రజల కోసం చేసిన అభివృద్ధే రాజకీయాలకు అసలైన కొలమానమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. పార్టీ అధికారంలో లేని సమయంలో కూడా అండగా నిలిచే కార్యకర్తలే నిజమైన బలమని, నిబద్ధతతో పనిచేసే వారికే భవిష్యత్‌లో నాయకత్వ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. పార్టీ ద్వారా పదవులు, గౌరవాలు పొందిన కొందరు స్వార్థంతో పార్టీని వీడుతున్నారని విమర్శించారు. జగన్ ప్రభుత్వ హయాంలో బీసీల సాధికారత కోసం 57 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, బడుగు బలహీన వర్గాలకు అనేక పదవులు కల్పించామని గుర్తు చేశారు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించడమే రాజకీయాల లక్ష్యమని, కండువాలు మార్చుకోవడం రాజకీయ విజయానికి కొలమానం కాదని స్పష్టం చేశారు. రాయచోటి ప్రాంత అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలని, పెండింగ్ ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల పనులను పూర్తి చేసి ప్రజల విశ్వాసం పొందాలని ఆయన సూచించారు.

# ప్రొద్దుటూరులో బీసీ బాలికల వసతి గృహంలో వైద్య శిబిరం

● 85 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు..

● వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 19:–** పట్టణంలోని ఏబీఎం స్కూల్ సమీపంలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల (బీసీ) బాలికల వసతి గృహంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ కటారు మానస పాల్గొని విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పీరియడ్స్ సమయంలో పాటించాల్సిన పరిశుభ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య సంరక్షణపై విద్యార్థినులకు వివరించారు. సి.ఓ.ఎం.వి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించి అవగాహన కల్పించారు. అనంతరం 85 మంది బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారి శ్రీమతి సత్యవతి, ఏఎన్ఎం పద్మావతి, ఫార్మసిస్ట్ దినేష్, ఆశా కార్యకర్తలు పుష్పకుమారి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# తరిగొండ రమేష్‌ని పరామర్శించిన రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు



**రాయచోటి మన జనప్రగతి జూలై 19 :–** రాయచోటి మున్సిపాలిటీ మాసాపేట కావలివాండ్లపల్లెలో నివాసముంటున్న తరిగొండ రమేష్ ఇటీవల జరిగిన స్కూటర్ ప్రమాదంలో కాలు ఫ్రాక్చర్ అయ్యి ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు వారి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదం ఎలా జరిగిందనే వివరాలను అడిగి తెలుసుకున్న సుగవాసి ప్రసాద్ బాబు , రమేష్ త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని మునుపటిలాగే ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సూచనలు పాటించాలని సూచించారు. అలాగే కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, అవసరమైన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని భరోసా ఇచ్చారు.

# యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి: సీఐ వెంకటేశ్వర్లు

- పార్వతిపురం క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు నగదు బహుమతుల ప్రదానం



**సిద్ధవటం, మన జనప్రగతి, జూలై 19:–** మాధవరం–1 గ్రామ పంచాయతీ, పార్వతిపురం గ్రామంలోని ప్లేగ్రౌండ్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఆదివారం నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకుని ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. టోర్నమెంట్‌లో పేరయ్యగారిపల్లె జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, టీడీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య రూ.50 వేల నగదు బహుమతి అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన మాధవరం జట్టుకు ఓబుల్‌రెడ్డి రూ.30 వేల నగదు బహుమతి ప్రదానం చేశారు. టీడీపీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్మోహన్‌రాజు ఆధ్వర్యంలో గత నెల రోజులుగా నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించాయని నాయకులు తెలిపారు. భవిష్యత్తులోనూ మండల, నియోజకవర్గ స్థాయిలో మరిన్ని క్రికెట్ పోటీలు నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజశేఖర్, జెడ్పీటీసీ సభ్యుడు ముద్దు కృష్ణారెడ్డి, కుప్పాల వెంకటసుబ్బయ్య, గాలివీటి శ్రీనివాసులు, బి. ఓబులయ్య, సుంకేసుల భాష, శ్రీనివాసులు, కృష్ణయ్య, ప్రసాద్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఐ వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు.

# జాతీయ రహదారిపై నిలిపిన లారీలో 390 లీటర్ల డీజిల్ చోరీ



**సిద్ధవటం, మన జనప్రగతి, జూలై 19:–** కడపచెన్నై జాతీయ రహదారిపై సిద్ధవటం మండలం మాధవరం–1 పార్వతిపురం గ్రామ సమీపంలో రోడ్డు పక్కన నిలిపిన లారీ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు 390 లీటర్ల డీజిల్‌ను చోరీ చేశారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. లారీ డ్రైవర్ మౌలాలి తెలిపిన వివరాల ప్రకారం.. తాడిపత్రి నుంచి చెన్నైకి సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న లారీకి ప్రొద్దుటూరులో టైర్లు మార్చించిన అనంతరం ఆదివారం రాత్రి బయలుదేరారు. కడపలో బంధువులను కలిసి సోమవారం తెల్లవారుజామున 1 గంట ప్రాంతంలో మాధవరం–1 సమీపంలో లారీని రోడ్డు పక్కన నిలిపి నిద్రపోయారు. ఉదయం లేచి చూడగా ఆయిల్ ట్యాంక్‌ను పగులగొట్టి సుమారు 390 లీటర్ల డీజిల్‌ను చోరీ చేసినట్లు గుర్తించారు. చోరీకి గురైన డీజిల్ విలువ సుమారు రూ.40 వేల వరకు ఉంటుందని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మండల ఎస్సై హారిక ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనుమానిత ప్రాంతాలు, దుకాణాలను పరిశీలిస్తూ నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

# ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో మీడియాదే కీలక పాత్ర

● ఎమ్మెల్సీ సతీమణి భూమిరెడ్డి ఉమాదేవి






**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 19:–** పులివెందుల ప్రెస్ క్లబ్ జర్నలిస్టుల నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్ కడప జిల్లా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి గారి సతీమణి భూమిరెడ్డి ఉమాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన వెన్నపూస జయరామ క్రిష్ణా రెడ్డి, ఉపాధ్యక్షులు దాసరి కార్తీక్ మరియు కమిటీ సభ్యులందరికీ ఆమె తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉమాదేవి మాట్లాడుతూ సమాజంలో విలేకరుల పాత్ర,ఎరు పాటించాల్సిన విలువల గురించి కీలక ప్రసంగం చేశారు. ప్రజలకు నిజమైన వార్తలను అందించడంలోనూ, ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలోనూ జర్నలిస్టుల పాత్ర ఎంతో అభినందనీయమని కొనియాడారు. సమాజంలో ఉన్న సమస్యలను వెలికితీయడం,నిజాయితీగా,నిర్భయంగా వార్తలు రాయడం విలేకరుల ప్రాథమిక కర్తవ్యం అని సమాజ శ్రేయస్సుకు బలంగా, బాధ్యతాయుతంగా మీడియా పనిచేయాలని భూమిరెడ్డి ఉమాదేవి పేర్కొన్నారు. తన భర్త, ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి రాజకీయ ప్రస్థానాన్ని ఈ సందర్భంగా ఆమె గుర్తుచేసుకున్నారు. గతంలో ఆయన 'ఉదయం' పత్రికలో ఒక సాధారణ రిపోర్టర్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించి, నేడు ఎమ్మెల్సీ స్థాయికి ఎదిగి రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకోవడం తనకు ఎంతో సంతోషాన్ని,గర్వాన్ని ఇస్తోందని పంచుకున్నారు. చివరగా,ఈ అద్భుతమైన కార్యక్రమానికి తనను ఆహ్వానించి,గౌరవించినందుకు ప్రెస్ క్లబ్ ప్రతినిధులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు,స్థానిక జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎద్దుల కొండ్రాయునికి పంచలోహ ఆభరణాలు

- దేవస్థానం ఇఓ కడప సుభాష్



**వేంపల్లె మన జనప్రగతి జూలై 19:–** స్థానిక పాపాగ్నినది ఒడ్డున వెలసిన శ్రీలక్ష్మి వృషభాచలేశ్వర స్వామి ఎద్దుల కొండ్రాయునికి పంచలోహ ఆభరణాలను భక్తులు పోలేపల్లి కృష్ణారావు, సౌజన్య దంపతులు సమర్పించినట్లు దేవస్థానం ఇఓ కడప సుభాష్ వెల్లడించారు. ఆదివారం కడప రోడ్డులోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల కు రూ. 26,800 విలువ చేసే మకరకంటి, లక్ష్మి కాసులదండను పాలక మండలి చైర్మన్ పివి రమణ, అర్చకులు హరిప్రవీణ్, తిరుమల వేణు లకు అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలను ఘనంగా సత్కరించారు. దాతల సహకారం మరువలేనిదని, దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఛైర్మన్, ఇఓ లు కోరారు. దాతల కుటుంబ సభ్యులు సత్యనారాయణ, శైలజ, పాపయ్య, పద్మలత, నాగరాజా, నాగరత్న, పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉరవకొండ అసెంబ్లీ ఎన్.డబ్ల్యు.సి కన్వీనర్‌గా మఠం అశోక్ చక్రవర్తి




**ఉరవకొండ మన జనప్రగతి జూలై 19:–** నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ (ఎన్‌డబ్ల్యూసీ) ఉరవకొండ అసెంబ్లీ కన్వీనర్‌గా మఠం అశోక్ చక్రవర్తిని నియమించారు. జాతీయ చైర్మన్ రాహుల్ ద్వివేది మార్గదర్శకత్వంలో, రాష్ట్ర చైర్మన్ అంబటి నవకుమార్ నాయకత్వంలో, జిల్లా చైర్మన్ తోట సూర్యప్రకాశ్ రెడ్డి ఈ నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా అశోక్ చక్రవర్తి మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకానికి సంస్థ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, అటవీ సంరక్షణ, వాతావరణ మార్పులపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కృషి చేస్తానన్నారు. మొక్కల నాటడం, పరిశుభ్రత, నీటి సంరక్షణ వంటి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి, ఉరవకొండ అసెంబ్లీ పరిధిలో యువత, మహిళలు, విద్యార్థులు, ప్రజలను భాగస్వాములను చేస్తూ పర్యావరణ పరిరక్షణ కోసం పనిచేస్తానని తెలిపారు. ఈ బాధ్యతలు అప్పగించిన జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఏఐఎఫ్డీఎస్ డిమాండ్




**అనంతపురం మన జనప్రగతి జూలై 19:–** దేశంలోని విద్యార్థుల భవిష్యత్తుతో సంబంధం ఉన్న పరీక్షల నిర్వహణపై తలెత్తిన వివాదాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్డీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు సీఎం సిద్దు డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఏర్పడిన అనుమానాలను నివృత్తి చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం నిరాహార దీక్ష చేస్తున్న పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో ఆయన ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఆరోపణలపై స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావాలని, విద్యార్థుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని ఆయన కోరారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఏఐఎఫ్డీఎస్ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక
20 - 07 - 2026

# ఎస్సీ గురుకుల (బాలికలు)పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్ల పంపిణీ.

- మార్కెట్ యార్డ్ చైర్మన్ షఫీ నాయక్ చేతుల మీదుగా విద్యార్థినులకు పంపిణీ.
- విద్యార్థుల సంక్షేమం పట్ల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు కృతజ్ఞతలు.



**లక్కిరెడ్డిపల్లి మన జన ప్రగతి జూలై 19 :-** లక్కిరెడ్డిపల్లి మండలంలోని ఎస్సీ (బాలికల) గురుకుల పాఠశాలలో 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర' కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మార్కెట్ యార్డ్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎండి షఫీ నాయక్, విద్యార్థినులకు స్వయంగా కిట్లను అందజేశారు.విద్యార్థుల సంక్షేమమే ధ్యేయం: షఫీ నాయక్ఈ సందర్భంగా డాక్టర్ షఫీ నాయక్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థినుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని కొనియాడారు. ఈ విద్యా సంవత్సరం నుండి ఏపీ వ్యాప్తంగా బాలికల వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థినుల సౌకర్యార్థం, గతంలో అందజేసే సామాగ్రితో పాటు అదనంగా నైట్ డ్రెస్ లు, తువాలు, మరియు స్వెట్టర్లను 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర' కిట్లలో చేర్చి అందించడం జరిగిందని వివరించారు. విద్యార్థినుల అవసరాలను గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యొక్క చిత్తశుద్ధిని, గొప్పతనాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు.తమకు అందిన ఈ కిట్ల పట్ల విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపారు.విద్యా వాతావరణాన్ని మెరుగుపరిచేలా ప్రభుత్వం తీసుకుంటున్న ఇటువంటి నిర్ణయాలు విద్యార్థినులకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ప్రిన్సిపాల్, అహ్మద్ అలీ, ఎస్ ముక్తార్, మల్లీ నాయుడు, పకీరయ్య, తుమ్మల మల్లికార్జున, షేక్ అమీర్ బాషా, అశోక్, బీజేపీ నాయకులు వెంకటరామరాజు, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# కనీస వేతనాల పెంపు కై ఈనెల 30,31న కలెక్టరేట్ వద్ద ధర్నా. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు




**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జులై 19:-** జులై 30,31 వ తేదీల లో ప్రభుత్వ సంస్థలలో పని చేస్తున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఆప్కాస్ శ్రామిక వర్గం మొత్తం మరియు అంగన్వాడీ ఆశా మధ్యాహ్నం భోజనం వివో ఏ లాంటి స్కీమ్ వర్కర్స్ కనీస వేతనాల పెంపు కై సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండు రోజుల పాటు కలెక్టర్ ఆఫీస్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు పేర్కొన్నారు. ఆదివారంకనీస వేతనాల గోడ పత్రికలు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కార్మికులతో కలసి ఆవిష్కరణ చేశారు అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రశీ లో కార్మికులకు కనీస వేతనాల చట్టం అమలు చేయకుండా గత 10సంవత్సరాలనుండి ప్రభుత్వాలు శ్రమ దోపిడీ చేస్తున్నాయని తెలిపారు. అన్ని రకాల వస్తువుల ధరలు, పని గంటలు,ఇంటి అద్దెలు పెరిగాయని వేతనం పెరగలేదని వెంటనే జీతాలు పెంచాలన్నారు. ప్రభుత్వాలు పెట్టుబడులు పేరుతో రాష్ట్ర జీడీపీ రేట్ పరుగులేడుతోందని ప్రచారం చేస్తున్నప్పటికీ,శ్రమ జీవుల వేతనాల పతనం తో వారి కుటుంబ జీవన ప్రమాణాలు ప్రమాదం లో ఉన్నాయని పేర్కొన్నారు. అనేక పరిశ్రమలు మూత పడ్డాయని నిరుద్యోగ శాతం పెరుగుదల ప్రమాద తీవ్రత చెబుతోందని విమర్శలు చేశారు. ఆకలి ఆహార భద్రత కరువు చాయలుసమీపంలో ఉన్నా ప్రభుత్వం నష్ట నివారణకు చర్యలు చేపట్టక పోగా అభివృద్ధి పేరు తోకార్పొరేట్ల ఊడిగం చేస్తున్నదని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల కు నిధులు లేక జనం కార్మికులు మౌలిక సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా లోని యావత్ కార్మిక వర్గం వేతనాలు పెంపు కొరకు జరిగే రెండు రోజుల ధర్నా కార్యక్రమం లో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మున్సిపల్ నాయకులు బీవీ రమణ, చెన్నయ్య, విద్యుత్ ఏ వి రమణ, సుబ్రహ్మణ్యం రాజు, శ్రీనివాసులురెడ్డి, సిద్ధమాల్లు, దేవా, కిరణ్, అక్బర్, నాగరాజు, గంగాధర్, పయాజ్ లు పాల్గొన్నారు

# రౌడీ షీటర్లలో మార్పు రావాలి

**- సమాజానికి ఆదర్శంగా నిలవాలి: రైల్వే కోడూరు రూరల్ సిఐ శ్రీనివాసులు**



**ఓబులవారిపల్లి మన జనప్రగతి జూలై 19 :-**తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పుల్లంపేట సర్కిల్ పరిధిలో ఆదివారం రౌడీషీటర్లకు రైల్వే కోడూరు రూరల్ సీఐ శ్రీనివాసులు అవగాహన సదస్సు. ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు. రేణిగుంట డి.ఎస్.పి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఏర్పాటు చేశామని ఆయన అన్నారు అంతేకాకుండా రౌడీషీటర్ల లో మార్పు రావాలని. అలాగే సమాజానికి ఉపయోగపడే మంచి కార్యక్రమాలు సమాజంలో ఆదర్శ వంతులుగా తయారు కావాలని ఆయన సూచించారు. అదేవిధంగా ఆయా ప్రాంతాలలో రౌడీలు ఇలా చలామణి అవుతూ శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తూ ఎక్కడపడితే అక్కడ మద్యం సేవించి ప్రజలను ఇబ్బంది పెట్టేవారు ఇకపై మారకుంటే శాశ్వతంగా జైలుకేనని ఆయన హెచ్చరించారు సమాజంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సమాజ సేవ కోసం పాటుపడాలని ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అలాగే పిడి యాట్లు కూడా నమోదు చేసి చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది ఉన్నారు

# ప్రొద్దుటూరులో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు.. : 21న ఐద్వా ఆందోళన!



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 19:-** ప్రొద్దుటూరులో ఉదయం 11 గంటలకు మాత్రమే తెరవాల్సిన మద్యం దుకాణాలు, బార్లు నిబంధనలను ఉల్లంఘిస్తూ తెల్లవారుజామున 5 గంటల నుంచే తెరచి మద్యం విక్రయిస్తున్నారని, అంతేకాకుండా అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఐద్వా పట్టణ కార్యదర్శి జి. ప్రేమ, అధ్యక్షురాలు వై. విజయమ్మ ఆరోపించారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, మద్యం మరియు మత్తు పదార్థాలకు యువత బానిసలవడంతో చిన్న వయస్సులోనే అనేక కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆదివారాల్లో మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, దీంతో ఎన్నో కుటుంబాలు తమ ఆప్తులను కోల్పోయి దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.ప్రభుత్వం ఆదాయం కోసం వీధి వీధిలో మద్యం దుకాణాలను ఏర్పాటు చేస్తోందని విమర్శించిన వారు, మద్యం కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై నిరసనగా జూలై 21, మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రొద్దుటూరులోని రాజీవ్ సర్కిల్ వద్ద ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

# మంగంపేట కట్ట పుట్టాలమ్మకు ఘనంగా పూజలు నిర్వహించిన కూటమి నేతలు ముక్కా వరలక్ష్మీ తదితరులు



**ఓబులవారిపల్లి మన జనప్రగతి జూలై 19 :-** తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం మంగంపేట అగ్రహారంలో వెలసిన పురాతన రాయల కాలం నాటి దేవత కట్టా పుట్టాలమ్మ జాతర ఆదివారం గ్రామస్తుల సమక్షంలో గ్రామ పెద్దల సమక్షంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూటమి నేతలు ఆహ్వానం మేరకు కూడా చైర్మన్ టిడిపి ఇన్చార్జి ముక్కారూపానంద రెడ్డి సతీమణి మొక్క వరలక్ష్మి మరియు కోటమి నాయకులు కల్లా చలపతి గల్లా శ్రీధర్ పోకూరి సుబ్రహ్మణ్యం ఓరుగంటి అనిల్ స్వామి గునిపాటి వారి కుటుంబం సభ్యులు గ్రామ పెద్దలు గల్లా నారాయణ మరియు మాజీ ఎమ్మెల్సీ టిడిపి సీనియర్ నాయకులు పద్యాల చంగల్ రాయలు తదితర మంగంపేట పెద్దలు నాయకులు హాజరై కట్టా పట్టాలమ్మకు ఘనంగా పూజలు నిర్వహించారు అనంతరం కోలాటం పందరి భజన కార్యక్రమం తిలకించారు భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు ఈ కార్యక్రమంలో మంగంపేట గ్రామస్తులు పెద్దలు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భక్తులు పాల్గొన్నారు

# ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా పాత్ర అత్యంత కీలకం

- ప్రజలకు,ప్రభుత్వానికి మధ్య జర్నలిస్టులు వారధిగా నిలవాలి
- తుంగభద్ర ప్రాజెక్టు హై లెవల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి
- ఘనంగా పులివెందుల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 19:-** సమాజంలో జరిగే పరిణామాలను నిష్పాక్షికంగా ప్రజలకు చేరవేస్తూ, ప్రజలకుప్రభుత్వానికి మధ్య జర్నలిస్టులు వారధిగా నిలవాలని తుంగభద్ర ప్రాజెక్టు హై లెవల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి పిలుపునిచ్చారు. పులివెందుల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జయరామ కృష్ణా రెడ్డి, క్రమశిక్షణ కమిటీ అధ్యక్షులు రమణ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మారెడ్డి జోగిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా 16 మంది కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం మారెడ్డి జోగిరెడ్డి మాట్లాడుతూ మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం లాంటిదన్నారు. ప్రస్తుత సమాజంలో నిజాయితీ,వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా బాధ్యత మరింత పెరిగిందని గుర్తు చేశారు.ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని జర్నలిస్టులు తమ వృత్తి ధర్మాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వైఎస్సార్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు,కార్యవర్గ సభ్యులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ ఈ క్లబ్ మరింత అభివృద్ధి చెందుతూ జర్నలిస్టుల సంక్షేమానికి విశేష సేవలందించాలని ఆకాంక్షిస్తున్నాను అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర హజ్ & ఉర్దు అకాడమీ డైరెక్టర్ మహబూబ్ బాష, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్,టీడీపీ సీనియర్ నాయకులు నల్లాగారి భాస్కర్ రెడ్డి,కూటమి నాయకులు,ప్రెస్ క్లబ్ ప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆత్మీయ విందులో పాల్గొన్న రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు



**చక్రాయపేట మన జనప్రగతి జూలై 19 :-** చక్రాయపేట మండలం సురబి గ్రామం కోమటిపేటలో ఆదివారశీ పోత వారి కుటుంబం ఏర్పాటు చేసిన ఆత్మీయ విందులో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారుపోత రమణ ఆహ్వానం మేరకు విచ్చేసిన ప్రసాద్ బాబు కి స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన విందులో నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొని ఆత్మీయంగా ముచ్చటించారు.ఈ కార్యక్రమం పరస్పర స్నేహభావాన్ని, ఐక్యతను ప్రతిబింబిస్తూ విజయవంతంగా నిర్వహించారు .ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్‌లో బోయ రమేష్ విజయం



**ఉరవకొండ మన జనప్రగతి జూలై 19:-**ఉరవకొండ మండలం చిన్నమూస్టూరు గ్రామానికి చెందిన బోయ రమేష్ ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్ (ఏఐబిఇ)లో ఉత్తీర్ణత సాధించారు. దీంతో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసేందుకు అర్హత పొందారు.బోయ రమేష్ బీకాం, ఎంకాం, ఎల్ఎల్‌బీ విద్యార్హతలు కలిగి ఉన్నారు. గతంలో ఏబీవీపీ మాజీ విద్యార్థి నాయకుడిగా, బీజేపీ యువజన విభాగం మాజీ రాష్ట్ర నాయకుడిగా పనిచేసిన ఆయన ప్రస్తుతం బీజేపీ జిల్లా గుడ్ గవర్నెన్స్ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్‌లో విజయం సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు, రాజకీయ, సామాజిక వర్గాల ప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఈ విజయం తనకు మరింత బాధ్యతను పెంచిందని, ప్రజలకు న్యాయం అందేలా నిబద్ధతతో పనిచేస్తానని రమేష్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా బోయ రమేష్ మాట్లాడుతూ, న్యాయవాదిగా సేవలందించాలన్న తన లక్ష్యం నెరవేరిందని, కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా పేద ప్రజలకు చట్టపరమైన సహాయం అందిస్తూ సమాజానికి ఉపయోగపడే విధంగా న్యాయ సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# నేడు బొమ్మనహాల్‌లో రైతుల అవగాహన సదస్సు..

**- ముఖ్య అతిథిగా పాల్గొనున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు**



**బొమ్మనహాల్ మన జనప్రగతి జూలై 19:-**ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు నేడు బొమ్మనహాల్ మండలంలో రైతులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాయదుర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు విచ్చేయుచున్నారని,మండల కన్వీనర్ కురుబ మల్లేన్న తెలియజేశారు,ముందుగా మండల పరిధిలో దేవగిరి క్రాస్ ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులను పరిశీలించి, అనంతరం మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవన్‌లో సాయంత్రం 4 గంటలకు"రైతన్న మేలుకో ప్రత్యామ్నాయ పంట ఎంచుకో" అంశంపై రైతులతో అవగాహన సదస్సులో పాల్గొంటారు, వర్షాభావ పరిస్థితుల్లో రైతులు చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ పంటలు,సాగు విధానాలు, ప్రభుత్వ సహాయ చర్యలపై రైతులకు వివరించనున్నారు.ఈ కార్యక్రమానికి మండలంలోని రైతులు,రైతు కూలీలు, వ్యవసాయ,ఇరిగేషన్ శాఖ అధికారులు,ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, మండల పార్టీ అధ్యక్షుడు కురుబ మల్లన్న కోరారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
20 - 07 - 2026

## ఎండిన 'డొక్కల మడుగు'.వన్యప్రాణుల దాహార్తిపై రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ ఆందోళన



**చెన్నూరు, మన జనప్రగతి, జులై 19:–** వైయస్సార్ కడప జిల్లా శేషాచల నల్లమల అటవీ ప్రాంతం చింతకొమ్మదిన్నె మండలం గంగనపల్లె రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని 'డొక్కల మడుగు' ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో పూర్తిగా ఎండిపోవడంపై మైదుకూరుకు చెందిన ప్రముఖ రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ అడవి జంతువుల దాహార్తిని తీర్చే ఈ కీలకమైన నీటి వనరు ప్రస్తుతం ఎడారిని తలపిస్తోందని వాపోయారు.అంతరించిపోయే ప్రమాదంలో అరుదైన 'బంగారు నక్కలు'గతంలో కరవు కాలంలో సైతం కొద్దిపాటి నీటితో కళకళలాడే ఈ మడుగుకు ఎలుగుబంట్లు, దుప్పులు, కొండ గొర్రెలు, రేసు కుక్కలు భారీగా వచ్చేవని రమేష్ గుర్తుచేశారు. వీటన్నింటితో పాటు ఎంతో విశిష్టమైన, అరుదైన జాతికి చెందిన 'బంగారు నక్కలు ఇక్కడికి ఎక్కువగా వస్తుంటాయని, గతంలో తోడేళ్లు, హైనాలు కూడా ఈ ప్రాంతంలో సంచరించేవని తెలిపారు.ప్రస్తుత పరిస్థితుల్లో నీరు లేక ఇక్కడున్న అరుదైన బంగారు నక్కల జాతి అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వానికి, అటవీ శాఖకు అధికారులకు తెలియజేశారువన్యప్రాణుల మనుగడను కాపాడటానికి ప్రభుత్వం, అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని బొమ్మిశెట్టి రమేష్ డిమాండ్ చేశారు.డొక్కల మడుగులో పేరుకుపోయిన పూడికను తక్షణమే తొలగించాలని కోరారు.అడవి జంతువుల దాహార్తిని తీర్చడానికి నీటి ట్యాంకర్ల ద్వారా మడుగులోకి నీటిని చేరవేయాలని వివరించారు.కొలుములపల్లె పంచాయతీ లింగారెడ్డిపల్లెకు చెందిన నాగమల్లారెడ్డి తనకు ఈ మడుగు ఎండిన సమాచారం తనకు అందించారని రమేష్ వెల్లడించారు.కడప అటవీ శాఖ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ పూడిక తీయడం కష్టంతో కూడుకున్న పనని, దీనికి శాశ్వత పరిష్కారం కోసం సౌర విద్యుత్ వాటర్ పంపును ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ పీలేరు నూతన అధ్యక్షుడిగా చింతల విజయ భాస్కర్ రెడ్డి.




**పీలేరు మన జనప్రగతి జులై 19:–** లయన్స్ క్లబ్ ఆఫ్ పీలేరు నూతన కార్యవర్గం (20262027) ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం పీలేరు లయన్స్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమానికి లయన్ చంద్ర హెచ్. రెడ్డి, పీఎంజేఫ్ , గత జిల్లా గవర్నర్ (317జు) ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి లయన్ బి.ఆర్. నాగ బాలాజీ, అధ్యక్షుడు, అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా 20262027 సంవత్సరానికి లయన్ సి. విజయ భాస్కర్ రెడ్డి అధ్యక్షుడిగా, లయన్ సి. సురేంద్ర రెడ్డి కార్యదర్శిగా, లయన్ పి.వి. రమణ కోశాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పీలేరు నూతన సభ్యులుగా ఆర్. శ్రీమన్ & డా. పి. మానస (రేవూరి & గుప్తా కుటుంబం), ఎం. సాయిపునీత్ ఎం. సాయి నరసింహ బి. హేమంత్ రెడ్డి & శ్రీ బి. రేవంత్ రెడ్డి ఆనంద ఆప్టికల్స్), డా. పి. తేజ శ్రీ (చిన్నారి హాస్పిటల్), ఎం. లక్ష్మీకాంత రెడ్డి & డా. ఎ. మాధవి (మాధవి హాస్పిటల్స్), ఎస్. శ్రీనివాసులు (ఉపాధ్యాయులు), పగడాల రామమోహన్ (డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్, పలమనేరు), అమూరి మహీధర్, శ్రీపురం ప్రణీత్ (వెంకటేశ్వర జ్యువెల్లర్స్), మేకల చేతన్ కుమార్ రెడ్డి ఎం. భవాని శంకర్ (న్యాయవాది), టి. సురేష్ (డిప్యూటీ మేనేజర్, ప్రిజమ్ జాన్సన్ లిమిటెడ్)సామాజిక సేవే లక్ష్యంగా పనిచేస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ పీలేరు ఆధ్వర్యంలో రాబోయే సంవత్సరంలో నేత్ర వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, విద్యా మరియు ఆరోగ్య సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు,కార్యవర్గ సభ్యులు లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫాం వితరణ చేశారు.సమాజ సేవ, ఆరోగ్యం, విద్య, పర్యావరణ పరిరక్షణ, పేదలకు సహాయం వంటి రంగాల్లో ప్రజలకు మరింత సేవ చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, ప్రముఖులు, శ్రేయోభిలాషులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

## జగద్గురు చెన్నబసవ రాజేంద్ర స్వామికి అంతిమ నివాళులు

**ఉరవకొండ మన జనప్రగతి జూలై 19:–**శ్రీ గవిమఠ సంస్థానం 8వ పీఠాధిపతి పరమపూజ్య జగద్గురు చెన్నబసవ రాజేంద్ర స్వామికి ఆదివారం ఉరవకొండలో భక్తులు, శిష్యులు, ప్రజాప్రతినిధులు ఘనంగా అంతిమ నివాళులు అర్పించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న స్వామివారు 98 ఏళ్ల వయస్సులో బ్రహ్మలీనమయ్యారు.స్వామివారి పార్థివదేహాన్ని బళ్లారి నుంచి ఉరవకొండ గవిమఠానికి తీసుకువచ్చి భక్తుల చివరి దర్శనార్థం ఉంచారు. వేలాది మంది భక్తులు బారులు తీరుతూ చివరి చూపు కోసం తరలివచ్చి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. స్వామివారి ఆశీస్సులు, ఆధ్యాత్మిక సేవలను ఈ సందర్భంగా పలువురు స్మరించుకున్నారు.అనంతరం వీరశైవ సంప్రదాయాల ప్రకారం మఠాధిపతుల సమక్షంలో వేద మంత్రోచ్చారణల నడుమ అంత్యక్రియలు నిర్వహించి, స్వామివారిని బృందావనంలో సమాధి చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొని స్వామివారికి ఘనంగా వీడ్కోలు పలికారు. జగద్గురువు సమాజానికి అందించిన ఆధ్యాత్మిక సేవలు చిరస్మరణీయమని పలువురు నివాళులర్పించారు.







## స్వంత ఖర్చులతో డ్రైనేజీ కాలువ శుభ్రం చేసిన మాజీ సర్పంచ్ లింగాల పార్వతమ్మ

- మూడు నెలలుగా నిల్వ ఉన్న డ్రైనేజీ నీటితో గ్రామస్తుల అవస్థలు
- దుర్వాసన,దోమల బెడదతో ప్రజల ఇబ్బందులు
- శాశ్వత పరిష్కారం కల్పించాలని అధికారులకు గ్రామస్థుల విజ్ఞప్తి



**వేముల మన జనప్రగతి జులై 19:–**వేముల మండలం బెస్తవారిపల్లె గ్రామంలో గత మూడు నెలలుగా డ్రైనేజీ నీరు బయటకు వెళ్లే మార్గం లేక కాలువల్లోనే నిల్వ ఉండటంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.నిల్వ నీటి కారణంగా దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల బెడద రోజురోజుకూ పెరిగి ప్రజలు ఇళ్లలో ఉండటానికే ఇబ్బంది పడుతున్న పరిస్థితి నెలకొంది. చిన్నారులు, వృద్ధులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు.సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని గ్రామస్థులు వాపోయారు. ఈ నేపథ్యంలో అధికారంలో లేకపోయినా గ్రామ ప్రజల ఇబ్బందులను గుర్తించిన మాజీ సర్పంచ్ లింగాల పార్వతమ్మ తన స్వంత ఖర్చులతో డ్రైనేజీ కాలువను శుభ్రం చేయించి, అడ్డంకులను తొలగించి నిల్వ ఉన్న నీరు సాఫీగా బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టారు. దీంతో గ్రామంలో నెలకొన్న సమస్యకు తాత్కాలికంగా ఉపశమనం లభించింది.ప్రజా సమస్యల పట్ల చొరవ చూపి వెంటనే స్పందించిన మాజీ సర్పంచ్ లింగాల పార్వతమ్మను గ్రామస్థులు అభినందించారు.ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ఇలాంటి సమస్యలపై వెంటనే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేసి శాశ్వత పరిష్కారం కల్పించాలని గ్రామ ప్రజలు సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేశారు.

## రాయచోటి సీఐ బీవీ చలపతి పై హైకోర్టులో కేసు దాఖలు

- సివిల్ కేసులో జోక్యం వద్దంటూ హైకోర్టు ఆదేశం
- కేసు వివరాలు సమర్పించాలని సిఐ కి నోటీసు ఈనెల 22 కు వాయిదా వేసిన హైకోర్టు

**రాయచోటి స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 19:–** రాయచోటి అర్బన్ సిఐ బీ.వీ.చలపతి, ఎస్సై జహీర్ కలిసి సివిల్ కేసులో జోక్యం చేసుకొని తమ ప్రతివాదులకు సహాయం చేయడానికి తమను వేధించారంటూ రాయచోటి పట్టణానికి చెందిన పసుపులేటి రాజశేఖర్ అనే వ్యక్తి హైకోర్టులో రిట్ పిటిషన్( ఢ్లూ చీశీ. 16653/2026) దాఖలు చేయగా, సివిల్ కేసులో జోక్యం వద్దంటూ సిఐ బీవీ చలపతికి ఎస్సై జహీర్ కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి రాయచోటి పట్టణం మాసాపేట గ్రామం పూల తోటపల్లి సర్వేనెంబర్ 4/1ఏ 1 లోని 40 చదరపు గజాల ఇంటి జాగా తమ పూర్వీకులకు సంబంధించినదని అందులో తమ ఒక వాటా రావాలని పసుపులేటి రాజశేఖర్ అతని కుటుంబ సభ్యులు రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో భాగ పరిష్కారం కేసు ఓ ఎస్ నెంబర్. 126/2026 దాఖలు చేశారు. అయితే కేసు పెండింగ్ ఉండగానే అతని ప్రత్యర్థులు వివాద స్థలంలో 13.06.2026 తేదీన ఇంటి నిర్మాణం పనులు మొదలుపెట్టారు. రాజశేఖర్ కుటుంబ సభ్యులు ఇంటి నిర్మాణం చేపట్టడానికి వీలు లేదంటూ తమ వాటా మాకు ఇచ్చిన తర్వాతనే ఏదైనా చేసుకోవాలని అభ్యంతరం తెలిపారు. దీనితో రాజశేఖర్ ప్రత్యర్థులు అబ్బవరం రెడ్డమ్మ, తిరుపతమ్మ రాయచోటి అర్బన్ సీఐ బీవీ చలపతిని కలిసి ఫిర్యాదు చేశారు. దీనితో రాయితోటి అర్బన్ సీఐ చలపతి రాజశేఖర కుటుంబ సభ్యులను పోలీస్ స్టేషన్ కు 13.06.2026 తేదీన పిలిపించి రోజంతా పోలీస్ స్టేషన్ లో ఉంచి బెదిరించి వేధింపులకు గురి చేసి బట్టలు విప్పదీసి ఆరోజు సాయంత్రం వరకు పోలీస్ రిమాండ్ లో అక్రమంగా ఉంచారని రాజశేఖర్ హైకోర్టుకు తెలిపారు. పోలీసులు దగ్గరుండి తమ ప్రత్యర్థుల చేత ఇంటి నిర్మాణం చేయించారని తమను మాత్రం పోలీస్ స్టేషన్ లోనే ఉంచి ప్రత్యర్థులు జరిపే అక్రమ కట్టడానికి సపోర్ట్ చేశారని రాజశేఖర్ హైకోర్టును 22.06.2026 తేదీన ఆశ్రయించి జరిగిన సంఘటనను హైకోర్టుకు వివరించారు. కేసును పరిశీలించిన హైకోర్టు, ఏ అధికారంతో సీఐ చలపతి, రాజశేఖర్ ను అతని కుటుంబ సభ్యులను పోలీస్ స్టేషన్ కి పిలిపించి వేధింపులకు గురి చేశారో తెలపాలంటూ సిఐ చలపతికి 18.07.2026 తేదీన హైకోర్టు నోటీసులు జారీచేసి కేసును ఈనెల 22 కు వాయిదా వేసింది. అంతవరకు రాజశేఖర్ ఇంటి జాగా లోనికి పోలీసులు కానీ రాజశేఖర్ ప్రత్యర్థులు గాని ప్రవేశించడానికి వీలు లేదంటూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

## భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర

**- భారతీయ జనతా పార్టీ నాయకులు ఏల చంద్రశేఖర్**



**వలిగొండ, మన జనప్రగతి జూలై 19:–** సోమవారం ఉదయం 10 గంటలకు బొమ్మలరామారం మండలంలో స్థానిక సమస్యల పైన బొమ్మలరామారం మండల శాఖ ఆధ్వర్యంలో పాదయాత్ర కార్యక్రమం భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి శ్రీ అశోక్ గౌడ్ గారు పాదయాత్ర ప్రారంభోత్సవం చేస్తారు. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 1:30 గంటలకు బొమ్మలరామారం మండలంలో నీ చీకటి మామిడి గ్రామం వద్ద ముగుస్తుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ రామచంద్ర రావు గారు హాజరవుతున్నారు. కావున మండలంలోని రాష్ట్ర, జిల్లా, మండల, వివిధ మోర్చాల పదాధికారులు, సీనియర్ నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా తెలియజేస్తున్నాం.



## వేములను సన్మానించిన నాయకులు


**రామన్నపేట మన జనప్రగతి జూలై 19:–** జనంపల్లి పద్మశాలి సంఘం, అధ్యక్షుడుకి ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శుభాకాంక్షలు తెలియచేశారు రామన్నపేట మండలం జనంపల్లి గ్రామంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన వనం శ్రీనివాస్ ని, అలాగే స్కిల్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన సంగిశెట్టి సుదర్శన్ ని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమాజ అభివృద్ధిలో సంఘాల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. నూతనంగా ఎన్నికైన నాయకత్వం సభ్యులందరినీ కలుపుకొని సంఘ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. పద్మశాలి సోదరుల సంక్షేమానికి, వారి వృత్తిపరమైన అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు. నూతన అధ్యక్షులకు వారి బాధ్యతల్లో అన్ని విధాలా విజయాలు చేకూరాలని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కబేలాను పునరుద్ధరించాలి: సిపిఎం డిమాండ్




**రామన్నపేట మన జనప్రగతి జూలై 19:–** సిపిఎం పట్టణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు కందుల హనుమంతు డిమాండ్ ఆదివారం రామన్నపేట పట్టణ కమిటీ సమావేశం బాబు చారి అధ్యక్షతన జరిగిన సమావేశం.లో కందుల హనుమంతు సిపిఎం పట్టణ కార్యదర్శి మునుకుట్ల లెనిన్ .మాట్లాడుతూ గ్రామంలో మేకలను గొర్రెలను ఎవరి ఇంటి ముందు వారు కోయడం ద్వారా వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయడం వలన దుర్గంధం వెదజల్లుతున్నందున ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని మేకల .గొర్రెల మాంసాన్ని ఒకే చోట కోసేందుకు కబేలాను పునరుద్ధరించేందుకు మాంసం మార్కెట్ ఏర్పాటు చేయాలని అధికారులు ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఒకే చోట కోయడం ద్వారా గ్రామ పంచాయితీ ముద్ర వేసిన మేకల గొర్లను మాంసాన్ని విక్రయించాలని ప్రజల ఆరోగ్యాలు కాపాడాలనివారు కోరారు. ఈ కార్యక్రమాల్లో మండల కమిటీ సభ్యులు గొరిగే స్వాములు సీనియర్ నాయకులు ఆముద ఆంజనేయులు . పల్లె సత్యం నకిరేకంటి సురేష్ బాబు చారి. పల్లె లింగస్వామిఅప్పం సంతోష్ బొల్లా వెంకన్న కడారి రాములు తదితరులు పాల్గొన్నారు

## ఉద్యమకారుల గుర్తింపు కమిటీ నుండి ఉద్యమకారుల ఫోరం అధ్యక్షునికి ఆహ్వానం



**వలిగొండ మన జనప్రగతి జూలై 19:–** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ నుండి ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామిని సంప్రదింపుల సమావేశంలో పాల్గొనేందుకు తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఆహ్వానం పంపారు.తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారి సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టాల్సిన విధానాలు చర్యలపై సమగ్ర నివేదికను రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీని ఏర్పాటు చేసింది. తెలంగాణ ఉద్యమంలో వివిధ దశల్లో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులతో కమిటీ సంప్రదింపులు సమావేశాలు నిర్వహిస్తుంది. అందులో భాగంగా శీలం స్వామిని కమిటీ ఆహ్వానించింది. ఈ ఆహ్వానం వలిగొండ తెలంగాణ ఉద్యమానికి ఎంతో గర్వకారణమని ఆయన అన్నారు..

# అంగరంగ వైభవంగా వైఎస్సార్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం







**జర్నలిస్టుల సంక్షేమమే ప్రధాన లక్ష్యం: నూతన కమిటీ**

**మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం: అతిథులు**

**ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి నిస్వార్థంగా కృషి చేస్తాం: నూతన కార్యవర్గం**

**రాజకీయ, అధికార వర్గాల సమక్షంలో ఘనంగా ప్రమాణ స్వీకారం**

**పులివెందుల మన జనప్రగతి జూలై 19:-** అంగరంగ వైభవంగా వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్ పులివెందుల నూతన కమిటీ ప్రమాణస్వీకారం జరిగింది. ఆదివారం పట్టణంలోని సత్రం బడి లో అన్ని రాజకీయ పార్టీ నాయకులు, అధికారుల , నియోజకవర్గంలోని విలేకరుల సమక్షంలో ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నాయకులు అధికారులు మాట్లాడుతూ మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం లాంటిదన్నారు. ప్రస్తుత సమాజంలో నిజాయితీ,వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా బాధ్యత మరింత పెరిగిందని గుర్తు చేశారు.ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని జర్నలిస్టులు తమ వృత్తి ధర్మాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వైఎస్సార్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు,కార్యవర్గ సభ్యులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ ఈ క్లబ్ మరింత అభివృద్ధి చెందుతూ జర్నలిస్టుల సంక్షేమానికి విశేష సేవలందించాలని వారు ఆకాంక్షిస్తారు ఈ ప్రెస్ క్లబ్ ప్రమాణ స్వీకారం మహోత్సవంలోఅధ్యక్షుడిగా వెన్నపూస జయరామ క్రిష్ణారెడ్డి , ఉపాధ్యక్షుడిగా దాసరి కార్తీక్, జనరల్ సెక్రెటరీ పి.దామోదర్ రెడ్డి, కోశాధికారి ఎం ఓం ప్రకాష్, ఉప కోశాధికారి ఎం మహేశ్వర గుప్తా, జాయింట్ సెక్రెటరీలుగా మల్లంపాటి జయరామిరెడ్డి, డి.రాజు, బి రామ మోహన్ రెడ్డి, డి. బాబు, పి.కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా చాంద్ బాషా, ఈసీ మెంబర్లుగా జి. రామకృష్ణ, వి.జాకీర్, జి. రాము, కె .అమీర్ భాష, ఎన్. ఉదయ్, కె. హరీష్ , గౌరవ అధ్యక్షులుగా టీ మారుతి ప్రసాద్, గౌరవ సలహాదారులు వై.గంగిరెడ్డి ఏ. నరసింహులు, వై. బాలకృష్ణారెడ్డి, వై. రామ సుబ్బారెడ్డి , క్రమశిక్షణ కమిటీ చైర్మన్ గా గజ్జల వెంకట రమణారెడ్డి, సభ్యులుగా డాక్టర్ వై వివేకానంద యాదవ్,గజ్జల శేషారెడ్డి, ఎన్. సురేంద్ర, డి. కృష్ణయ్య, బి .మహేశ్వర్ రెడ్డిలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తామని, నిస్వార్థంగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప ప్రెస్ క్లబ్ జర్నల్ సెక్రటరీ రామాంజనేయులు రెడ్డి ప్రజాశక్తి బ్యూరో నూర్ భాషా మరియు ప్రజాశక్తి ప్రొద్దుటూరు డివిజనల్ ఇన్చార్జి ప్రభంజనం రెడ్డి మాజీ రాజ్యసభ సభ్యుడు యన్. తులసి రెడ్డి, హెచ్ ఎల్ సి చైర్మన్ మా రెడ్డి జోగి రెడ్డి, వైసీపీ తొండూరు ఇంచార్జి మదన్ మోహన్ రెడ్డి, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మహబూబ్ బాషా, ఆర్డీవో చిన్నయ్య , డీఎస్పీ మురళి నాయక్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ దాసరి భాను ప్రకాష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి పిఎ రాఘవరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, టి ఎన్ టి యు సి రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లగారి భాస్కర్ రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్, బిజెపి నాయకులు లక్ష్మయ్య, మాజీ కౌన్సిలర్లు కిషోర్, రమణ వైసీపీ, టిడిపి, నాయకులు పాల్గొన్నారు.

# పులివెందుల ప్రెస్ క్లబ్ నూతన కమిటీకిలో మన జనప్రగతి', 'న్యూస్ అలర్ట్' ప్రతినిధుల ఘన సన్మానం



**శాలువాలు, పుష్పగుచ్ఛాలతో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడికి ఘన సత్కారం**

**ప్రెస్‌క్లబ్ మరింత బలోపేతం కావాలని ఆకాంక్ష**

**పులివెందుల ప్రెస్ క్లబ్ నూతన కమిటీకి 'మన జనప్రగతి', 'న్యూస్ అలర్ట్' ప్రతినిధుల ఘన సన్మానం**


**శాలువాలు, పుష్పగుచ్ఛాలతో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడికి సత్కారం**


**పులివెందుల అర్బన్, మన జనప్రగతి, జూలై 19:-** పులివెందుల వైఎస్సార్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి 'మన జనప్రగతి' మరియు 'న్యూస్ అలర్ట్' దినపత్రికల ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. పత్రికల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వై. వివేకానంద రెడ్డి యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సత్రంబడి ఆవరణలో ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఈ సత్కార కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వెన్నపూస జయరాం కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు దాసరి కార్తీక్‌లను 'మన జనప్రగతి', 'న్యూస్ అలర్ట్' నియోజకవర్గ విలేకరులు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి నాయకత్వంలో ప్రెస్‌క్లబ్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విలేకరులు మాట్లాడుతూ జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం, వృత్తి పరిరక్షణ కోసం ప్రెస్ క్లబ్ నిరంతరం కృషి చేయాలని సూచించారు. నూతన కమిటీ అన్ని వర్గాల జర్నలిస్టు లను సమన్వయం చేసుకుంటూ క్లబ్‌ను మరింత బలోపేతం చేయాలని కోరారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల అమలు, వృత్తి అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆకాంక్షించారు. నూతన కమిటీ సభ్యులు సన్మానానికి కృతజ్ఞతలు తెలుపుతూ, సభ్యులందరి సహకారంతో ప్రెస్ క్లబ్ అభివృద్ధికి, జర్నలిస్టుల సంక్షేమానికి నిస్వార్థంగా సేవలందిస్తామని హామీ ఇచ్చారు. 'మన జనప్రగతి' కడప జిల్లా బ్యూరో ఇన్‌చార్జి కె. హరి, పులివెందుల అర్బన్ రిపోర్టర్ ఎస్. ఖాజాపీర్, తొండూరు రిపోర్టర్ వాసుదేవరెడ్డి, లింగాల రిపోర్టర్ చంద్రమోహన్‌రెడ్డి, వేంపల్లి రిపోర్టర్ ఎస్.ఎం. బాషా, పులివెందుల రూరల్ రిపోర్టర్ కె. భగవాన్‌తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.



# రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగించిన విద్యుత్ ఉద్యోగి సిద్ధారెడ్డి

**● నెల రోజులుగా ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులకు ఊరట ● సామాజిక మాధ్యమాల్లో ఫోటో వైరల్ కావడంతో స్పందించిన షిఫ్ట్ ఆపరేటర్ రామ సిద్ధారెడ్డి.**





**వేముల మన జనప్రగతి వార్త జూలై 19:-** కడపపులివెందుల ప్రధాన రహదారి నుంచి చాగలేరు గ్రామానికి వెళ్లే మార్గంలో ప్రధాన రహదారికి సమీపంలో నెల రోజులుగా రోడ్డుకు అడ్డంగా ఓ పెద్ద చెట్టు పడివుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో ప్రతిరోజూ గ్రామస్థులు,రైతులు,విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు లేదా స్థానిక సంస్థలు చెట్టును తొలగించేందుకు చర్యలు తీసుకోకపోవడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు.ఆదివారం ఉదయం ఈ చెట్టుకు సంబంధించిన ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో విషయం పలువురి దృష్టికి వెళ్లింది.దీనిపై స్పందించిన ఏపీ ఎస్పీడీసీఎల్ వి.కొత్తపల్లి సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న షిఫ్ట్ ఆపరేటర్ చాపాటి రామసిద్ధారెడ్డి మానవత్వంతో ముందుకు వచ్చారు. ఎలాంటి అధికారిక ఆదేశాల కోసం వేచి చూడకుండా స్వయంగా సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టును తొలగించి మార్గాన్ని పూర్తిగా అందుబాటులోకి తీసుకొచ్చారు.దీంతో నెల రోజులుగా ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. బాధ్యతగా స్పందించి ప్రజలకు ఉపయోగపడే పని చేసిన చాపాటి రామసిద్ధారెడ్డిని స్థానికులు అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రతి ఒక్కరూ ఇదే తరహా సామాజిక బాధ్యతతో ముందుకు వస్తే ఇలాంటి సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.

# వేముల మండలంలో కుక్కల బీభత్సం..30 గొర్రెల మృతి

**● రూ.3 లక్షల నష్టం..ఘటన స్థలాన్ని పరిశీలించిన వైకాపా మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివరెడ్డి**



**వేముల మన జనప్రగతి జూలై 19:-** కడప జిల్లా వేముల మండలం చింతలజూటూరు గ్రామంలో కుక్కల బీభత్సానికి 30 గొర్రెలు మృతి చెందగా, మరో 10 గొర్రెలు తీవ్రంగా గాయపడిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో బాధితులకు సుమారు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు సమాచారం.గ్రామానికి చెందిన రామిరెడ్డి గంగిరెడ్డి, తుమ్మలూరు ఉత్తయ్య, తుమ్మలూరు గంగులయ్యలకు చెందిన గొర్రెల మందపై శనివారం అర్ధరాత్రి కుక్కల గుంపు దాడి జరిగింది.గొర్రెల కాపరులు నిద్రలో ఉన్న సమయంలో దొడ్డిలోకి చొరబడిన కుక్కలు విచక్షణారహితంగా దాడి చేయడంతో 30 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి.మరో 10 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి.ఆదివారం ఉదయం గొర్రెల దొడ్డికి వెళ్లిన యజమానులు మృతిచెందిన గొర్రెలను చూసి కన్నీరుమున్నీరయ్యారు.జీవనాధారమైన గొర్రెలను కోల్పోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు తెలిపారు.ఘటన విషయం తెలుసుకున్న వేముల మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ నాగేళ్ల సాంబశివరెడ్డి ఆదివారం ఘటన స్థలానికి చేరుకుని మృతిచెందిన గొర్రెలను పరిశీలించారు. బాధిత రైతులను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు తగిన నష్టపరిహారం అందించాలని, గ్రామంలో వీధి కుక్కల బెడదను నివారించేందుకు శాశ్వత చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను కోరారు.ఈ ఘటనతో చింతలజూటూరు గ్రామంలో విషాద ఛాయలు అలుముకోగా, పశుపోషకులు తమ జీవనాధారాన్ని కోల్పోయి ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా గ్రామంలో వీధి కుక్కల బెడదపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# అనుమతులు లేకుండా వెళుతున్న ఇసుక లారీలను ఆపిన టిడిపి నాయకులు



**చిట్వేలి మన జనప్రగతి జూలై 19:-** అనుమతులు లేకుండా అధిక లోడుతో వెళుతున్న ఇసుక లారీలను చిట్వేలి మండలం పెద్దూరు గ్రామం వద్ద టీడీపీ నాయకులు నిలిపివేశారు. ఈ సందర్భంగా టిడిపి చిట్వేలి మండల అధ్యక్షులు కాకర్ల నాగార్జున మాట్లాడుతూ ఆదివారం ఇసుక క్వారీ నుండి అక్రమంగా అనుమతులు లేకుండా అధిక లోడుతో లారీలు వెళుతుండగా నిలిపామని అన్నారు. ఇసుకాసురుల ప్రవర్తనతో తెలుగుదేశం పార్టీకి చెడ్డ పేరు వస్తుందని ఉద్దేశంతో లారీలను నిలిపివేశామని ఆయన తెలిపారు. ఒక్కో ఇసుక లారీలో 29 ల వరకు ప్రభుత్వ అనుమతి ఉండగా 50 నుంచి 55 టన్నులు వేసుకుని వెళు తున్నారన్నారు. చిట్వేలు నుండి రైల్వే కోడూరు కు కొత్తగా వేసిన రోడ్డుపై అధిక లోడుతో వెళుతూ ఉండడంతో రోడ్డు పాడైపోడమే కాకుండా గ్రామాలలోకి అధికంగా దుమ్ము వస్తోందని ఆరోపించారు. ఇటీవల చిట్వేలి పోలీస్ స్టేషన్ నందు రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు అధిక లోడుతో అనుమతులు లేకుండా వెళుతున్న లారీలను ఆపివేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు అన్నారు. ఒక్కరోజు పది లారీలను నిలిపినప్పటికీ ఆర్టీవో వచ్చి చూసి, ఇసుక రవాణా చేయడానికి అనుమతులు ఉన్నాయా లేదా అని విచారించకుండా, అధిక లోడుతో వెళుతున్న లారీల పైన ఎలాంటి చర్యలు తీసుకోకుండా వెళ్లిపోయాడని ఆరోపించారు. ఎలాంటి చర్యలు తీసుకోకుండా వెళ్లిపోయారని ఆరోపించారు. డీఎస్పీ వచ్చేంతవరకు ఆపిన 10 ఇసుక లారీలను వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన అన్నారు. రెవెన్యూ గనుల శాఖ పోలీసు ఉన్నత అధికారులు వచ్చి ఎలాంటి చర్యలు తీసుకుంటారో అప్పటివరకు ఇసుక లారీలను వదిలిపెట్టమని ఆయన అన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చిట్వేలి పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ తన పోలీసు సిబ్బందితో ఉన్నారు. టిడిపి చిట్వేలి మండల మాజీ అధ్యక్షులు కాకర్ల సుబ్బరాయుడు, నగరిపాడు మాజీ ఎంపీటీసీ లోకేష్, టిడిపి క్లస్టర్ -1 ఇంచార్జ్ వెంకటేష్, బుంగటావుల రాజశేఖర్,పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174